Bhavani Publication Trust

https://prajatheerpudaily.com

ప్రజాతీర్పు

The people's Vcrdict

తెలుగు జాతీయ దినపత్రిక

కావలెను

ప్రజాతీర్పు

The people's Vcrdict

తెలుగు జాతీయ దినపత్రిక

The Largest Circulated Telugu Fortnightly

సామాజిక, రాజకీయాలపై అవగాహన ఉన్న ఉత్సహవంతులైన యువకులు జర్నలిస్టులుగా ఎదిగే గొప్ప సదావకాశం..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రజాతీర్పు దినపత్రికలో తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పని చేయడానికి స్టాఫ్ రిపోర్టర్లు, కంట్రిబ్యూటర్లు, అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్లు, సర్కూలేషన్ ఇన్‌చార్జిలు కావలెను

వెంటనే కావలెను

• బ్యూరో ఇన్‌చార్జిలు • స్టాఫ్ రిపోర్టర్లు

ఆర్సి ఇన్‌చార్జిలు • మండల రిపోర్టర్లు

అనుభవం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును

ఆసక్తి ఉన్న వారు మీ పూర్తి బయోడేటా ఈ వాట్సాప్ నంబర్‌కు పంపగలరు

8309979541, 9885353018, 9494659622

సంపుటి : 26 | సంచిక : 341 | హైదరాబాద్ | బుధవారం 28 అక్టోబరు 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOR

తెలంగాణపై కమలం ఫోకస్!

రంగంలోకి అగ్రనేతలు.. ప్రధాని మోదీ..షా పర్యటన

- పార్టీకి అధికారమే లక్ష్యం
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను దెబ్బకొట్టే వ్యూహం
- అభివృద్ధి అస్త్రం ప్రయోగించనున్న మోదీ
- పార్టీ ప్రక్షాళనపై షా దృష్టి



తెలంగాణపై కమలనాథులు ఫోకస్ పెంచారు. నెక్స్ట్ టార్గెట్ తెలంగాణ అంటూ పశ్చిమ బెంగాల్ ఎన్నికల తర్వాత స్వయంగా ట్వీట్ చేసిన ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణలో పార్టీని బలోపేతం చేసేందుకు పూనుకుంటున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విజయానికి స్కోప్ ఉందని భావిస్తున్న బీజేపీ అధికార పీఠమే లక్ష్యంగా బీజేపీ ఇప్పటి నుంచే గ్రౌండ్ వర్క్ మొదలుపెట్టింది.

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

రాష్ట్రస్థాయి నేతలు తమ వంతు పోరాటం చేస్తున్నారు. అయితే ఇది సరిపోవట్లేదని పార్టీ హైకమాండ్ భావిస్తోందో ఏమో.. నేరుగా పార్టీ పెద్దలే రంగంలోకి దిగబోతున్నారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా తదితరులు రాబోయే రెండు నెలల్లో రాష్ట్రంలో పర్యటించబోతున్నారు. వీరు అధికారిక కార్యక్రమాలతో పాటు తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కేడర్‌కు దిశానిర్దేశనం చేయనున్నారు.

ప్రత్యామ్నాయంగా..

తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత రెండు విడతలు బీఆర్ఎస్ అధికారంలో ఉంది. ఆ తర్వాత కాంగ్రెస్ అధికారాన్ని చేపట్టింది. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా మళ్లీ పూర్వవైభవం సాధించాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. అధికార పార్టీపై ఎప్పటికప్పుడు పోరాటాలు చేస్తోంది. అధినేత బయటికి రాకపోవడం ఒక్కటే ప్రస్తుతం పార్టీకి ఉన్న మైనస్ పాయింట్. అయితే, ఆ లోటును తీర్చేందుకు గులాబీ బాస్ త్వరలోనే మళ్లీ యాక్టివ్ కానున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అంతేకాకుండా ఈసారి ఏకంగా జాతీయ రాజకీయాలను సైతం టార్గెట్ చేస్తారని అంటున్నారు. మరోపక్క అధికార కాంగ్రెస్ మూడేళ్ల పాలనపై జనంలో ఇప్పుడిప్పుడే అసం తృప్తి వ్యక్తం అవుతోంది. ఆరు గ్యారెం టీలు పూర్తి స్థాయిలో అమలు చేయకపో వడం, ఇప్పటికీ గత ప్రభుత్వాన్ని.. అప్పటి సీఎంను విమర్శించడం తప్ప కాంగ్రెస్ చేసేం దేమీ లేదని ఇటు బీజేపీ, అటు బీఆర్ఎస్ విమర్శిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో బీజేపీకి స్కోప్ ఉందని కమలనాథులు భావిస్తున్నారు. ఈ క్రమంలో ప్రత్యామ్నా యంగా తామేనని

-2వ పేజీలో

డిసెంబర్‌లో ప్రధాని మోదీ..

డిసెంబర్‌లో జరగనున్న ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన రాజకీయంగా అత్యంత కీలకం కానుంది. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు మంజూరు చేసిన జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు తదితర అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో పాటు భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. డబుల్ ఇంజిన్ సర్కార్ ద్వారానే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమనే నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం, కేంద్ర నిధుల వినియోగంపై స్పష్టతనివ్వడం ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని నెలకొల్పేందుకు ప్రయత్నిస్తోంది. తెలంగాణలో ఎవరితోనూ పొత్తులు లేకుండా, భవిష్యత్తులో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ అనే ముఖాముఖి పోరును సృష్టించడమే బీజేపీ అసలు లక్ష్యంగా ఉంది. బీఆర్ఎస్‌కు ఓటేస్తే కాంగ్రెస్‌కే మేలు జరుగుతుందనే ప్రచారాన్ని ప్రజల మెదళ్లలో నాటడం ద్వారా ఓట్ల చీలికను నివారించవచ్చని భావిస్తున్నారు. అయితే, ప్రధాని.. షా ధ్వయం ఫోకస్ పెడితే తెలంగాణలో బీజేపీ బలం పుంజుకుంటుందా? బీఆర్ఎస్ ఆశిస్తున్నట్లు మళ్లీ అధికారంలోకి వస్తుందా? రేవంత్ చెప్పినట్లు పదేళ్లు ఆయనే సీఎంగా ఉంటారా అన్నది ఓటర్ల చేతుల్లో ఉంది. ఏం చేస్తారో మరి.




సాంకేతికతలో ప్రపంచానికి మనం నాయకత్వం వహించాలి

- భవిష్యత్ సాంకేతికతలను అందిపుచ్చుకోవాలి
- నూతన ఆవిష్కరణలు చేయాలి
- కొత్త ఆలోచనా విధానంతో, నూతన ఆత్మవిశ్వాసంతో భారత్ ముందుకు సాగుతోంది
- ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబరు 27 (ప్రజాతీర్పు)

మన దేశం భవిష్యత్ సాంకేతికతలను అందిపుచ్చుకోవాలని, నూతన ఆవిష్కరణలు చేయాలని, వాటి అభివృద్ధిలో ప్రపంచానికి

-2వ పేజీలో



రాజీవ్ ప్రధాని కావడాన్ని వ్యతిరేకించా!

- ఏఐసీసీ అధినేత్రి సోనియాగాంధీ ప్రకటన
- పుస్తకం విడుదలయ్యాక నాటకీయ పరిణామాలుంటాయని వ్యాఖ్య

న్యూఢిల్లీ, అక్టోబర్ 27: రాజీవ్ గాంధీ ప్రధానమంత్రి కావడాన్ని తాను వ్యతిరేకించానని, తన పుస్తకంలోని విషయాలను తెలుసుకున్నాక కొంతమంది వారి అభిప్రాయాలను మార్చుకోవచ్చని, మరికొంతమం ది విభేదించవచ్చని ఏఐసీసీ అధినేత్రి సోనియాగాంధీ అన్నారు. మంగళవారం 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకానికి సంబంధించిన మరో పోస్ట్‌ను ఎక్స్‌లో సోనియాగాంధీ పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా సోనియాగాంధీ తన అభిప్రాయాలను పంచుకున్నారు. తాను ఆత్మకథ ఎందుకు రాయాలని అనుకున్నానో వివరించారు. తాను అనుభవించిన

-2వ పేజీలో

తల్లీకొడుకుల నకిలీలలు!

తప్పుడు పత్రాలతో భూముల అమ్మకం

కరీంనగర్ భూములపై కన్ను

పట్టించుకోకుంటే హాంఫట్.. విలువ కోట్లలో..

కరీంనగర్ భూములు అంటేనే హాట్ కేక్‌లు. ధరలు అమాంతం ఆకాశాన్ని అంటాయి. అలాంటి విలువైన భూములపై ఓ తల్లీకొడుకుల కన్ను పడింది. వాటిని ఎలాగైనా దక్కించుకోవాలని నకిలీ పత్రాలతో ఆ భూముల్లో గద్దల్లా వాలేందుకు ప్రయత్నిస్తున్నారు.

(ప్రజాతీర్పు ప్రతినిధి, కరీంనగర్)

నకిలీ పత్రాలను చూపించి భూములు అమ్ముకుని సొమ్ము కూడా బెట్టుకోవాలన్నది వారి ప్లాన్. కరీంనగర్ బొజ్జరమ్మ కుంట ప్రాంతంలో భూముల ధరలు సామాన్యులకు అందేస్థాయిలో లేవు. ఇక్కడి సర్వే నంబర్ 546, 562, 563లో కొన్ని భూములు ఉన్నాయి. ఈ భూములపై కన్నేసిన కరీంన గర్‌కు చెందిన సుంకరి తార, ఆమె కుమారుడు సుంకరి వంశీకృష్ణ నకిలీ పత్రాలతో ఈ భూము లు కాజేసేందుకు ప్రయత్నాలు ప్రారంభిం చారు. నాలా

-2వ పేజీలో





ప్రకృతి తెచ్చిన కరువు కాదు..

రేవంత్ రెడ్డి తెచ్చిన కరువు!

కాళేశ్వరం పంపులు ఆన్ చేయకుండా రైతుల పంటలు ఎండబెడుతున్నారు

రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు.. రెన్యువల్ సీఎం

కేసీఆర్ తిరిగి వస్తేనే తెలంగాణ మళ్లీ గట్టెక్కుతుంది: కేటీఆర్

(ప్రజాతీర్పు ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా)

ముఖ్యమంత్రి రేవంత్ అసమర్థ పాలన, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే తెలంగాణలో కరువు పరిస్థితు లు నెలకొన్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ప్రకృతి తెచ్చిన కరువు కాదని, రేవంత్ రెడ్డి తన వైఫల్యాలతో ప్రజల నెత్తిన రుద్దిన కరువని మండిపడ్డారు. రాష్ట్రంలో సాగునీటి కొరత, విద్యుత్ సమస్యలు, యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నదుల్లో నీళు పారుతున్నా వాటిని సాగుకు వినియోగిం చుకోకుం డా సముద్రంలోకి వదిలేస్తున్నా రని, అందుబాటులో ఉన్న నీటిని రైతులకు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. మంగళవారం తెలం గాణ భవన్‌లో నిర్మల్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ

-2వ పేజీలో

రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించం

- భూ వివాదాల శాశ్వత పరిష్కారానికి రీ-సర్వే: మంత్రి పొంగులేటి



(సంగారెడ్డి, అక్టోబరు 27 (ప్రజాతీర్పు)

భూ వివాదాలను శాశ్వతంగా పరిష్కరిం చేందుకు 125 ఏళ్ల తర్వాత ప్రభుత్వం రీసర్వే చేపట్టిందని.. ఈ విషయాన్ని రైతులు గుర్తించి సహకరించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. రీ సర్వే సందర్భంగా రెవెన్యూ సిబ్బంది రైతులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలన్నారు. ఇప్పటికీ కొందరు అధికారుల

-2వ పేజీలో



'పౌరసరఫరాల'ను దివాలా తీయించిన కాంగ్రెస్ ప్రభుత్వం

భారాస అధికారంలోకి రాగానే రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరిస్తాం: హరీశ్‌రావు

(గజ్వేల్, అక్టోబరు 27 (ప్రజాతీర్పు)

అసమర్థ పాలనతో కాంగ్రెస్ ప్రభుత్వం పౌరసరఫరాల వ్యవస్థను పూర్తిగా దివాలా తీయించి రూ.లక్ష కోట్ల అప్పుల్లోకి నెట్టిందని భారాస శాసనసభాపక్ష ఉప నేత హరీశ్‌రావు ఆరోపించారు. మంగళవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో నిర్వహించిన డీలర్ల గౌరవ వేతన సాధన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. డీలర్లకు రూ. 5 వేల గౌరవ వేతనం ఇస్తామని మ్యానిఫెస్టోలో పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. భారాస అధికారంలో ఉన్నప్పుడు రూ. 70 కమీషన్‌ను రూ. 140 పెంచి వారికి కేసీఆర్ ఆర్థిక భరోసా కల్పించారని పేర్కొన్నారు. మూసీ సుందరీక రణ, ఫుట్‌బాల్, అందాల పోటీలకు వెచ్చించేందుకు డబ్బులు ఉన్నాయి కానీ డీలర్లకు గౌరవ వేతనం ఇచ్చేందుకు సర్కారు వద్ద నిధులు లేవా? అని ప్రశ్నించారు. భారాస మళ్లీ అధికారంలోకి రాగానే రూ. 300 కమీషన్‌తో సహా డీలర్ల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో నిత్యావసర సరకుల ధరలు పెరిగి సామాన్యుల బతుకులు ఆగమవుతున్నా యన్నారు. రాష్ట్రవ్యా ప్తంగా డీలర్ల వద్ద ఉన్న రూ. 600 కోట్ల విలువైన దొడ్డు బియ్యాన్ని వినియోగించకుండా వదిలేయడంతో అది పూర్తిగా పిండిగా మారిపోయి పందికొక్కులు, ఎలుకల

-2వ పేజీలో

సాంకేతికతలో ప్రపంచానికి
మనం నాయకత్వం వహించాలి

(మొదటి పేజీ తరువాయి)

నాయకత్వం వహించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలో ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్ కాన్క్లేవ్(ఎస్టిక్)2026లో ఆయన పాల్గొన్నారు. ఆయా రంగాల నిపుణులు, పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ప్రసంగించారు. దేశం కోసం, ప్రపంచం కోసం, నేటికీ, రేపటికీ నూతన సాంకేతికతను సృష్టించి, దాని దిశను నిర్దేశించడమే భారతదేశ లక్ష్యమని చెప్పారు. నూతన సాంకేతికతను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని సూచించారు. దశాబ్దాల క్రితం సైన్స్ అండ్ టెక్నాలజీలో మన దేశం వెనుకంజలో ఉండేదని గుర్తుచేశారు. ప్రపంచంలో ఎక్కడైనా ఏదైనా కొత్త ఆవిష్కరణ జరిగితే.. ఆ సాంకేతికత కొన్ని సంవత్సరాల తర్వాత మన దేశానికి చేరేదని వివరించారు. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిందన్నారు. కొత్త టెక్నాలజీని రూపొందించి, ప్రపంచానికి అందించే సామర్థ్యం మనకు ఉందని తెలిపారు. శాస్త్ర, సాంకేతిక రంగంలో 21వ శతాబ్దపు భారతదేశం ఒక కొత్త ఆలోచనా విధానంతో, నూతన ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతోందని వ్యాఖ్యానించారు. నేటి కృత్రిమ మేధ(ఏఐ) యుగంలో కొత్త సవాళ్లు ఉన్నాయని ప్రధాని మోదీ తెలియజేశారు. ఉదాహరణకు.. ఉత్పాదకతను పెంచడానికి ఏఐ సాధారణ పనులను వేగంగా చేయగలిగినప్పటికీ, అది స్వతంత్ర ఆలోచనను పరిమితం చేయకూడదని, దాన్ని మరింత సుసంపన్నం చేయాలని చెప్పారు. తద్వారా ఆదా అయిన సమయాన్ని మరింత క్లిష్టమైన సమస్యల పరిష్కారం, కొత్త ప్రయోగాలు, ఆలోచనల కోసం ఉపయోగించుకునేలా వీలు కల్పించాలని అన్నారు. ఆర్థిక వ్యవస్థలకు, జాతీయ భద్రతకు ఏఐ యుగంలో తలెత్తుతున్న సైబర్ సెక్యూరిటీ ముప్పుల గురించి ప్రధానమంత్రి ప్రస్తావించారు. జాతీయ వ్యవస్థలను పరిరక్షించి, మానవాళికి సేవ చేసే ఏఐ ఆధారిత, క్వాంటం భద్రతా పరిష్కారాలను అభివృద్ధి చేయాలని సూచించారు. దేశానికి సాధికారత కల్పించడంతోపాటు మానవాళి సమస్యల పరిష్కారానికి కూడా దోహదపడే సాంకేతికతలను అభివృద్ధి చేయడమే మన లక్ష్యం కావాలని సైంటిస్టులకు పిలుపునిచ్చారు. గణితంలో 'సున్నా'ఆవిష్కరణ నుంచి సంఖ్యా వ్యవస్థ అభివృద్ధి, ఖగోళ శాస్త్రంలో పురోగతి వరకు భారతదేశ సంస్కృతి ఎల్లప్పుడూ జ్ఞానం, ఆవిష్కరణలతో ముడిపడి ఉందని ప్రధానమంత్రి వెల్లడించారు. ప్రస్తుతం మన దేశం ఈ శాస్త్రీయ వారసత్వాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు తీసుకువెళుతోందని అన్నారు. అణుశక్తి ప్రాముఖ్యతను వివరించారు. 'వికసిత్ భారత్'నిర్మాణానికి భారీ స్థాయిలో అణుశక్తి అవసరమని, అందుకే మనం ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ టెక్నాలజీని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఆగస్టులో తమిళనాడులోని కల్పాకంలో దేశపు మొట్టమొదటి స్వదేశీ నమూనా ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ క్రిటికాలిటీని సాధించడం ఒక ముఖ్యమైన మైలురాయి అని అభివర్ణించారు. వివిధ కీలక రంగాల్లో భారత్ సాధించిన విజయాలు అపూర్వమైనవని మోదీ అన్నారు. మన దేశంలో తయారైన చిప్‌లు ఇప్పుడు ప్రపంచ దేశాలకు చేరడం మొదలైందని చెప్పారు. బ్యాటరీ నిల్వ రంగంలో సైతం అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకొని సామర్థ్య పెంపుపై దృష్టి పెట్టామని తెలియజేశారు. అంతరిక్ష రంగంలో సాధించిన విజయాలను వివరించారు. భారత సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ చేపట్టిన జూలై మిషన్ గురించి ప్రస్తావించారు. అణుశక్తి నుంచి అంతరిక్షం వరకు, ఏఐ నుంచి సెమీకండక్టర్ల వరకు... ఈ రంగాలన్నింటి అవసరాలు వేర్వేరుగా ఉన్నప్పటికీ, వాటన్నింటి నుంచి వచ్చే సందేశం ఒక్కటేనని స్పష్టంచేశారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల్లో భారతదేశం తన బలాన్ని, విశ్వాసాన్ని పెంపొందించుకుంటోందని ఉద్ఘాటించారు. 'అభివృద్ధి చెందిన భారత్'ను నిర్మించేందుకు పరిశోధనా రంగాన్ని నిరంతరం బలోపేతం చేస్తున్నామని ప్రకటించారు.

రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించం

(మొదటి పేజీ తరువాయి)

పనితీరులో మార్పురావడం లేదని.. ఈ విషయాన్ని ఎట్టిపరిస్థితిలో సహించేది లేదని హెచ్చరించారు. సంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉమ్మడి మెదక్ జిల్లా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్ శాఖల పనితీరుపై మంత్రులు దామోదర్ రాజనర్సింహ, గడ్డం వివేక్ వెంకటస్వామిలతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం రీసర్వే చేపట్టిందన్నారు. ఏడాదిన్నరలోపు వ్యవసాయ భూములతోపాటు ఆబాదీ ఆస్తుల రీసర్వేను పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో రీసర్వే జరుగుతున్న తీరుపై తహసీల్దార్లు, సర్వేయర్లతో మంత్రి పొంగులేటి ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రెవెన్యూ అధికారులు రీసర్వే సందర్భంగా భూముల విస్తీర్ణాలలో హెచ్చుతగ్గులు వస్తున్న విషయాన్ని ఆయన దృష్టికి తెచ్చారు. సర్వేసంబరులో రెవెన్యూ రికార్డులో నమోదైన విస్తీర్ణం కంటే ఎక్కువగా ఉన్న వాటి గురించి ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకుంటుందన్నారు. భూ విస్తీర్ణం, సరిహద్దులకు సంబంధించిన వివరాలను పరిశీలించి, రైతులకు సందేహాలు లేకుండా వివరించాలని పేర్కొన్నారు. భూముల రీసర్వేను తహసీల్దార్ నుంచి మొదలుకుని కలెక్టర్ వరకు పర్యవేక్షించాలని సూచించారు. భూముల రీసర్వే అనంతరం ప్రతి భూ యజమానికి భూధార్ సంఖ్య కేటాయిస్తామని, ఉపగ్రహ చిత్రాలతో కూడిన భూపటాలను పట్టాదారు పాసుపుస్తకాల్లో పొందుపరచనున్నట్లు తెలిపారు.

ఇందిరమ్మ లబ్ధిదారులకు 230కే సిమెంటు బ్యాగ్

రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల సాకారమయ్యేవరకు విడతల వారీగా ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ఇళ్లు నిర్మిస్తున్న లబ్ధిదారులకు నిర్మాణ వ్యయం తగ్గించేందుకు రూ.230కే సిమెంటు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే నిర్మించుకుని ఫైనల్ బిల్లు రావాల్సిన లబ్ధిదారులకు త్వరలో మంజూరు చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీలు రఘునందన్‌రావు, సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సునీతాలక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాణిక్‌రావు, సంజీవరెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కలెక్టర్లు ప్రతీక్‌జైన్, హైమావతి, ప్రతిమాసింగ్ పాల్గొన్నారు.

ప్రకృతి తెచ్చిన కరువు కాదు..
రేవంత్ రెడ్డి తెచ్చిన కరువు!

(మొదటి పేజీ తరువాయి)

నాయకులు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వస్తాయా, కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిని ఎప్పుడు చేసుకుందామా అనే ఆలోచనలో ప్రజలు ఉన్నారని అన్నారు. చీకటిని చూస్తేనే వెలుగు విలువ తెలుస్తుందని, గాడిదను చూస్తేనే గుర్రం విలువ తెలుస్తుందని వ్యాఖ్యానించారు.

కేసీఆర్ పాలనలో రైతులకు భరోసా

పదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణకు 24 గంటల ఉచిత విద్యుత్, సాగునీటి సదుపాయాలు అందించామని కేటీఆర్ గుర్తుచేశారు. రైతుబంధు, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలతో ప్రజలకు అండగా నిలిచామని పేర్కొన్నారు. కరోనా సంక్షోభ సమయంలోనూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి ఆదుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు మోసపోయారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అన్ని హామీలను అమలు చేస్తామని చెప్పిన నాయకులు, ఇప్పుడు వాటి అమలుపై ప్రశ్నిస్తే తప్పించుకునే ధోరణిలో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. హామీలు అమలు చేయలేకపోతే ఆ విషయాన్ని స్పష్టంగా చెప్పాలని, ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేయవద్దని అన్నారు. హామీల అమలుపై ప్రశ్నిస్తే మూడు నెలల్లో పిల్లలు పుడతారా అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడటం బాధ్యతారాహిత్యమని కేటీఆర్ విమర్శించారు. మూడు నెలల్లోనే అన్నీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, మూడేళ్లు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు.

ఇది దేవుడు తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు

తెలంగాణలో కరువు పరిస్థితులు ప్రకృతి వల్ల మాత్రమే ఏర్పడినవి కావని, నీటి నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యమే ప్రధాన కారణమని కేటీఆర్ ఆరోపించారు. గోదావరి, కృష్ణా నదుల్లో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ వాటిని సద్వినియోగం చేసుకోకుండా వృథాగా సముద్రంలోకి పదిలేస్తున్నారని విమర్శించారు. జూన్ 19, 2026న కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించినప్పుడు లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహిస్తోందని, పంపులు ఆన్ చేసి నీటిని ఎత్తిపోయాలని ప్రభుత్వాన్ని కోరామని గుర్తుచేశారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని అన్నారు. కాళేశ్వరం పంపులు ఆన్ చేస్తే ప్రాజెక్టుపై ఇంతకాలం చేసిన ఆరోపణలు తప్పని తేలిపోతాయనే



భయంతోనే బటన్ నొక్కడం లేదని ఆరోపించారు. దేవుడు తెలంగాణ ప్రజల కోసం నీళ్లు పంపిస్తే, మధ్యలో పూజారి రేవంత్ రెడ్డి అడ్డుపడి బటన్ నొక్కకుండా అడ్డుకున్నారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. గోదావరి నుంచి 750 టీఎంసీలు, కృష్ణా నుంచి 250 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లిందని తన ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ నీటిని వినియోగించుకుని ఉంటే కోటి ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉండేదని అన్నారు.

పంటలు ఎండుతున్నా పట్టించుకోని ప్రభుత్వం

ఒకవైపు పంటలు కళ్ల ముందే ఎండిపోతుండటంతో రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకుని పంటలను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు రైతుబంధు సకాలంలో అందడం లేదని, కరెంటు, యూరియా, సాగునీటి సమస్యలు మరింత తీవ్రంగా మారాయని పేర్కొన్నారు. రైతుల కష్టాలను పరిష్కరించాల్సిన ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనలకే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. నెలనెలా ఢిల్లీకి వెళ్లి ఈఎంఐ కట్టడానికే ముఖ్యమంత్రి ఉన్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని, రెన్యువల్ సీఎం అని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో ఈఎంఐ కడితేనే ముఖ్యమంత్రి పదవి మళ్లీ రెన్యువల్ అవుతుందంటూ విమర్శించారు. రైతులకు రైతుబంధు పడకపోయినా, రాహుల్ బంధు మాత్రం సమయానికి అందుతోందని వ్యంగ్యంగా అన్నారు.

తెలంగాణ దోపిడీకి వేదికగా మారింది

రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి దోపిడీ వేదికగా మారిపోయిందని కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలను పక్కనపెట్టి ఢిల్లీ నాయకత్వాన్ని సంతృప్తిపరచడంపైనే ముఖ్యమంత్రి దృష్టి పెట్టారని విమర్శించారు. ఢిల్లీలో బీజేపీ ప్రజలను విభజించడంలో బిజీగా ఉంటే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రజలను దోచుకోవడంలో బిజీగా ఉందని వ్యాఖ్యానించారు. నిర్మల్‌లో బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, ఎంపీ గొడం నగేష్ గెలిచినా నియోజకవర్గానికి ఏమి సాధించారని ప్రశ్నించారు. నిర్మల్‌ను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయడం, మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, లిఫ్ట్ ఇరిగేషన్, మిషన్ భగీరథ, చెక్‌డ్యామ్‌లు, ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీల ఏర్పాటుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని గుర్తుచేశారు. పదేళ్లు మంత్రిగా పనిచేసిన ఇంద్రకరణ్ రెడ్డి అధికారం కోల్పోగానే పార్టీని వీడారని విమర్శించారు. అవకాశవాదులు పార్టీని వీడినా, పోరాటవాదులు బీఆర్ఎస్‌లోనే ఉన్నారని పేర్కొన్నారు.

కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష

తెలంగాణను ప్రస్తుత సంక్షోభం నుంచి బయటపడ వేయాలంటే కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అయితేనే తెలంగాణ మళ్లీ గట్టెక్కుతుందని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో అమలైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తిరిగి బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంకా ఎక్కువ సమయం లేదని, మరో ఏడాదిలో రాజకీయ పరిస్థితులు మారుతాయని వ్యాఖ్యానించారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ మళ్లీ అభివృద్ధి, సంక్షేమ బాటలోకి వస్తుందని అన్నారు.

నవంబర్ 11న నిర్మల్‌లో భారీ సభ

నిర్మల్‌లో బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయాలని కేటీఆర్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రామచరణ్ నాయకత్వంలో పార్టీ కార్యక్రమాలను విస్తరించాలని, యువ నాయకులు అనిల్ జాదవ్, జాన్సన్ రాథోడ్ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. నవంబర్ 11న నిర్మల్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ సభలో మరిన్ని చేరికలు ఉంటాయని వెల్లడించారు. పార్టీ కోసం కష్టపడుతున్న నాయకులు, కార్యకర్తలకు తగిన బాధ్యతలు అప్పగించే అంశంపై సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

రాజీవ్ ప్రధాని కావడాన్ని వ్యతిరేకించా!

(మొదటి పేజీ తరువాయి)

వివరాలను పొందుపరిచేందుకు పుస్తకం ఒక వేదికను కల్పించిందన్నారు. పుస్తకం విడుదలయ్యాక నాటకీయ పరిణామాలకు దారితీస్తుందన్నారు. తన గురించి వస్తున్న వార్తల్లో అనేకం అవాస్తవాలున్నాయని చెప్పారు. పుస్తకం ద్వారా వాస్తవాలను చెప్పదలచుకున్నట్లు వివరించారు. 544 పేజీలున్న ఈ పుస్తకం నవంబర్ 10న విడుదల చేయనున్నారు. ఇందులో సోనియాగాంధీ బాల్యం నుంచి ప్రస్తుతం వరకు జీవితంలో ఎదుర్కొన్న ఆటుపోట్లను, రాజకీయ ప్రయాణాన్ని వివరించారు.

'పారసరఫరాల'ను
దివాలా తీయించిన కాంగ్రెస్ ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

పాలైందన్నారు. సమస్యలతో వేగిపోయి రాజకీయాల్లోకి వచ్చిన తాను అధికార పక్షంలో ఉన్నా.. ఎక్కడున్నా సమస్యల పరిష్కారానికి తిరగబడతానని సభకు హాజరైన జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ ఉపాధ్యక్షుడిగా వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రేషన్‌డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, రేషన్‌డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాయికోటి రాజు, ప్రధాన కార్యదర్శి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జ్ఞానేశ్ రాజీనామా చేసేదాకా పోరాటం ఆగదు

- ఎస్ఐఆర్‌ను నిలిపివేయాల్సిందే
- పేద ప్రజల హక్కులను కాలరాస్తున్నారు
- 'జన్ సున్వాయి'లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ఆగ్రహం

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసేంత వరకు లేదా ప్రధానమంత్రి మోదీ స్వయంగా జోక్యం చేసుకొని ఆయనను సీఈసీ పదవి నుంచి తొలగించే వరకు తమ పోరాటం ఆగదని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తేల్చిచెప్పారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఐఖ) ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఢిల్లీలోని త్రిలోక్‌పురిలో జన్ సున్వాయి(ప్రజా విచారణ) కార్యక్రమంలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. త్రిలోక్‌పురి ప్రాంతంలోని నాలుగు పోలింగ్ బూత్‌ల నుంచి 416 మంది ఓటర్ల పేర్లను అక్రమంగా తొలగించారని ఆరోపించారు. దీనిపై సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను ప్రశ్నించగా, ఆయన సమాధానం చెప్పడానికి నిరాకరిస్తున్నారని, తప్పించుకొని తిరుగుతున్నారని మండిపడ్డారు. కానీ, ఈ విషయాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులను రాహుల్ గాంధీ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) నేత దీపాంకర్ భట్టాచార్య, స్వరాజ్ ఇండియాకు చెందిన యోగేంద్ర యాదవ్ కూడా పాల్గొన్నారు.

బిలియనీర్ల కోసం కొత్త హిందూస్తాన్

ఎస్ఐఆర్ కారణంగా దేశంలో కోట్లాది మంది ప్రజలు తమ ఓటు హక్కును కోల్పోతున్నారని రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తంచేశారు. పెద్ద ఎత్తున ఓట్ల చోరీ జరుగుతోందన్న విషయం దేశం మొత్తానికి అర్థమవుతోందని పేర్కొన్నారు. పేద ప్రజల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించి, వారి హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. కొద్దిమంది బిలియనీర్ల కోసం ఒక కొత్త భారతదేశాన్ని సృష్టించే ప్రయత్నం జరుగుతోందని ధ్వజమెత్తారు. ఆ కొత్త దేశంలో పౌరులకు ఎలాంటి హక్కులు ఉండవు, పేదలకు వారి హక్కులు దక్కవని చెప్పారు. అలాంటి కొత్త దేశం కేవలం బిలియనీర్ల ప్రయోజనాల కోసమే పని చేస్తుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కేవలం ధనికుల కోసం మాత్రమే ఒక హిందుస్తాన్‌ను సృష్టించే పనిలో నిమగ్నమై ఉన్నారని రాహుల్ గాంధీ విమర్శించారు. జ్ఞానేశ్ కుమార్ ఓట్ల దొంగతనానికి పాల్పడుతున్నారని, ఇది దేశద్రోహంతో సమానమని ఆరోపించారు. ఈ అన్యాయానికి వ్యతిరేకంగా గళమెత్తుతామని, ప్రజల ఓటు హక్కును కాపాడుకుంటామని ప్రకటించారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు ఏకతాటిపై ఉండి, అన్యాయానికి వ్యతిరేకంగా తమ గళాన్ని వినిపిస్తూనే ఉంటామని వెల్లడించారు.

'ఓటుకు కోట్లు' విచారణ జాప్యంపై సుప్రీంకోర్టు అసహనం

న్యూఢిల్లీ: దశాబ్ద కాలం క్రితం తెలంగాణలో సంచలనం సృష్టించిన 'ఓటుకు కోట్లు'కేసులో ఏళ్ల తరబడి ఇంటర్వెన్షన్ పిటిషన్లు దాఖలు కావడం, వాటి వల్ల విచారణలో జాప్యం జరుగుతుండటం పట్ల సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, సంద్ర వెంకటవీరయ్య తదితరులు దాఖలు చేసిన ఎస్ఎల్‌పీ (క్రిమినల్) పిటిషన్లపై మంగళవారం భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఇంటర్వెన్షన్ పేరుతో కేసు విచారణను పొడిగించే ప్రయత్నాలపై ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా ఇంటర్వెన్షన్ పిటిషన్ల వ్యవహారంపై కోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ కేసులో ఇంటర్వీనర్లకు కేవలం జోక్యానికి మాత్రమే అనుమతి ఇచ్చామని, అలాంటప్పుడు వాయిరు కౌంటర్ డాక్యుమెంట్లు ఎలా దాఖలు చేస్తారని ధర్మాసనం ప్రశ్నించింది. ఇది నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేసింది. చాలాకాలం తర్వాత అకస్మాత్తుగా ఇంటర్వెన్షన్లు తెరపైకి వస్తుండటం వల్ల అసలు కేసు విచారణకు ఆటంకం కలుగుతోందని, ఇలాంటి చర్యలు విచారణను తీవ్రంగా జాప్యం చేస్తున్నాయని కోర్టు అసహనం వ్యక్తం చేసింది.

తెలంగాణపై కమలం ఫోకస్!

(మొదటి పేజీ తరువాయి)

నిరూపించుకోవాలని బీజేపీ హైకమాండ్ గట్టిగా భావిస్తోంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలు, విద్యుత్ రంగ సవాళ్లు, రైతు రుణమాఫీ అమలులో సాంకేతిక లోపాలు, ఆరు గ్యారెంటీల అమలు తీరును బీజేపీ తీవ్రంగా ఎండగడుతోంది. కేవలం సోషల్ మీడియాకే పరిమితం కాకుండా, ఈ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని భావిస్తోంది. ఎన్నికల వరకూ వేచి చూడకుండా, రెండేళ్ల ముందే కేడర్‌ను సమరశంఖానికి సిద్ధం చేయడం ద్వారా ప్రత్యర్థి పార్టీలను ఆత్మరక్షణలోకి నెట్టాలనేది బీజేపీ వ్యూహంగా కనిపిస్తోంది. ఈ క్రమంలో నవంబర్‌లో హోంమంత్రి అమిత్ షా రాష్ట్రంలో పర్యటించబోతున్నారు. ఆయన పూర్తిగా సంస్థాగత ప్రక్షాళనపైనే దృష్టి పెడతారని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. బూత్ స్థాయి కమిటీల పనితీరు, నాయకుల మధ్య సమన్వయం, సోషల్ మీడియా నెట్‌వర్క్ పటిష్టతపై ఆయన దిశానిర్దేశం చేయనున్నారు. పార్టీలో అసమ్మతికి తావులేకుండా, క్షేత్రస్థాయిలో కష్టపడే సాధారణ కార్యకర్తలకు పెద్దపీట వేసేలా ఆయన నేరుగా బూత్ స్థాయి సైనికులకు మార్గదర్శనం చేయనున్నారు. పార్టీ క్యాడర్‌లో జోష్ నింపడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం.

తల్లీకొడుకుల నకిలీలలు!

(మొదటి పేజీ తరువాయి)

కన్వర్షన్, ఎలాంటి లేఅవుట్ అనుమతులు లేకుండా ... భూములకు నకిలీ పత్రాలు సృష్టించి ఈ తల్లీకొడుకులు భూములు అమ్ముకునేందుకు ప్రయత్నిస్తున్నారు. భూములు బేరానికి పెట్టి అవి తమ భూములేనని నకిలీ పత్రాలు చూపుతున్నారు. అయితే, మంచి ప్రాంతంలో భూములు ఉండటంతో పలువురు ఈ భూములను కొనేందుకు ఆసక్తిచూపుతున్నట్లు సమాచారం. సర్వేనంబర్ 546, 562, 563 భూములకు సంబంధించి సుంకరి తార, ఆమె కుమారుడు సుంకరి వంశీకృష్ణల వద్ద ఒరిజనల్ పత్రాలు లేవు. దీంతో ఈ భూములను కాజేసి, అమ్ముకునేందుకు వారు నకిలీ పత్రాలు సృష్టించారు. ఈ భూములు తమవేనని నమ్మించేందుకు ప్రయత్నిస్తున్నారు. వాటిని అమ్ముకుని కోట్లకు పడగలెత్తాలన్నది వీరి ప్లాన్.

అధికారులు రంగంలోకి దిగితేనే..

సర్వేనంబర్ 546, 562, 563 భూములకు లేని పత్రాలు సృష్టించి అమ్ముకునే ప్రయత్నం చేస్తున్న సుంకరి తార, సుంకరి వంశీకృష్ణ వ్యవహారాన్ని నిగ్గుతేల్చేందుకు అధికారులు రంగంలోకి దిగాల్సిన అవసరం ఉంది. తమవి అని చెబుతున్న తల్లీకొడుకుల వద్ద ఉన్న నకిలీ పత్రాలు ఎక్కడి నుంచి తయారు చేశారు. అసలు నాలా కన్వర్షన్, ఎలాంటి లేఅవుట్ అప్రూవల్ లేకుండా భూములు ఎలా అమ్మకానికి పెట్టారన్న విషయాన్ని అధికారులు తమ విచారణలో తేల్చాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు పట్టించుకోని పక్షంలో ప్రభుత్వ భూములతో పాటు ప్రైవేట్ భూములు కూడా ఇలా నకిలీ పత్రాలతో మాయం అయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



గుడికి సమీపంలో చికెన్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు వినతి

కోరుట్ల, అక్టోబర్ 27 ప్రజాతీర్పు

పట్టణంలోని 32వ వార్డు ఐబీ రోడ్డులో గల హనుమాన్ దేవాలయానికి సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ఐకే చికెన్ సెంటర్‌పై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికుడు ఇట్యాల నవీన్ కుమార్ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేవాలయానికి కేవలం 30 మీటర్ల లోపల చికెన్ సెంటర్ ఏర్పాటు చేయడంతో స్థానిక భక్తులు, ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. మాంస వ్యర్థాల పారవేత, దుర్వాసన వల్ల పరిసరాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తి ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. తెలంగాణ హైకోర్టు మార్గదర్శకాలు, తెలంగాణ మున్సిపాలిటీస్ చట్టం–2019 ప్రకారం ఈ కేంద్రానికి ట్రేడ్ లైసెన్స్, పోలీస్ ఎన్ఓసీ ఉన్నాయో లేదో నిర్ధారించాలని డిమాండ్ చేశారు.అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆలయానికి దుకాణానికి మధ్య ఉన్న దూరాన్ని కొలిచి చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే ఈ ఫిర్యాదుపై తీసుకున్న చర్యలను లిఖితపూర్వకంగా తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.



పోక్సో చట్టం, 2012పై న్యాయ అవగాహన కార్యక్రమం

(కళాశ్రీ గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్) అక్టోబర్ 27.

జగిత్యాల బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం బాలలపై లైంగిక నేరాల నుంచి రక్షణ చట్టం, 2012 ప్యాక్స్నో చట్టం పై న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు పోక్సో చట్టంలోని ముఖ్యమైన నిబంధనలు, బాలలపై లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పించడానికి తీసుకోవాల్సిన చట్టపరమైన చర్యలు, బాలల హక్కులు మరియు భద్రత యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. రెండవ అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి శ్రీమతి నిక్షిప్త విద్యార్థినులకు లిగుడ్ టచ్-- బ్యాడ్ టచ్, వ్యక్తిగత భద్రత, తమకు ఎదురయ్యే అనుచిత ప్రవర్తనను భయం లేకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాల్సిన ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులతో లిలిప్రతిజ్ఞ చేయించడం జరిగింది.లి తమను తాము మరియు ఇతర బాలలను రక్షించుకోవడం, వ్యక్తిగత హద్దులను గౌరవించడం, బాలలపై జరిగే వేధింపులను ధైర్యంగా ఎదుర్కోవడం, ఏదైనా అసురక్షిత పరిస్థితి ఎదురైతే నమ్మకమైన పెద్దలకు తెలియజేయడం, ప్రతి బాలికకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించేందుకు కృషి చేయడం వంటి అంశాలపై ప్రతిజ్ఞ చేయించారు. బాలల రక్షణ చట్టాలపై అవగాహన పెంపొందించడం, వ్యక్తిగత భద్రతపై విద్యార్థినులకు చైతన్యం కల్పించడం, బాలలపై జరిగే నేరాలను నివారించడంలో విద్యాసంస్థలు మరియు సమాజం పాత్రను తెలియజేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



యువ నేత చేతిలో ఎమ్మెల్సీ బ్రహ్మాస్త్రం

- యువ నేత,ఎమ్మెల్సీ కన్వీనర్ గార్లపాటి భారద్వాజ్ రెడ్డి ఆధ్వర్యంలో...
- బంచరాయి తండా లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన సదస్సు...

కురవి అక్టోబర్ 27(ప్రజా తీర్పు విలేఖరి):

డోర్నకల్ ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ డా.రామచంద్రు నాయక్ ఆదేశాల మేరకు కురవి మండలం బంచరాయి తండాలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన సదస్సు ను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కన్వీనర్ గార్లపాటి భారద్వాజ్ రెడ్డి మాట్లాడుతూ... పట్టభద్రులు ఓటు హక్కును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని,ఎన్నికల్లో పాల్గొని తమ బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రాధాన్యత, ఓటు నమోదు విధానం, ఓటింగ్ ప్రక్రియ గురించి గ్రామస్తులకు, యువతకు వివరించారు.విద్యావంతుల ఓటు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో వీరితో పాటు కురవి టౌన్ అధ్యక్షులు నారాయణ రాజేందర్ కుమార్,కురవి ఎస్టీ సెల్ అధ్యక్షులు గోపా నాయక్, కురవి మండల నాయకులు డాక్టర్. కరుణాకర్, ఆశ, రంజిత్, చందన, వెంకటేష్.కురవి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో సైకిల్ ర్యాలీ

హుస్నాబాద్ అక్టోబర్ 27 రవీందర్ ప్రజా తీర్పు



సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం హుస్నాబాద్ ఏసీపీ కార్యాలయం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ సదానందం , సీఐ శ్రీధర్ , హుస్నాబాద్ ఎస్ఐ లక్ష్మా రెడ్డి, అక్కన్నపేట ఎస్ఐ ప్రశాంత్, ప్రభుత్వ బాలుర పాఠశాల హెచ్ఎం,పీఈటీ, విద్యార్థులు మరియు సెయింట్ జోసెఫ్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏసీపీ సదానందం మాట్లాడుతూ, పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, విధి నిర్వహణలో వారు చేసిన సేవలను గుర్తుచేశారు. విద్యార్థుల్లో దేశభక్తి, సామాజిక బాధ్యత మరియు పోలీసుల సేవల పట్ల అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు.

అభివృద్ధి వైపే అడుగులు వేస్తున్నాం

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

అక్టోబరు 27 కరీంనగర్ టౌన్, ప్రజా తీర్పు



కరీంనగర్ ను అభివృద్ధి చేయడం వైపే అడుగులు వేస్తున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. మంగళవారం నగరంలోని 4వ డివిజన్ కేంద్ర మంత్రి పర్యటించి... పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. దుర్షెడ్ – గోపాల్ పూర్ రోడ్డులో 78 లక్షల యుఐడిఎఫ్ నిధులతో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ భూపతి రవీంధర్, పలువురు కార్పొరేటర్లతో కలిసి కేంద్ర మంత్రి భూమీ పూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం దుర్షెడ్– గోపాల్ పూర్ రోడ్డులో ఉన్న స్వయంభు విఘ్నేశ్వర స్వామీ ఆలయాన్ని మంత్రి సందర్శించి స్వామీ వారిని దర్శించుకొని... ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి.. మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ నగరాభివృద్ధికి కృషి చేస్తూ ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామన్నారు. యూఐడిఎఫ్ నిధులతో పాటు ఇతర గ్రాంట్ల నిధులతో పాలకవర్గం పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం చేసి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని తెలిపారు. త్వరలో యూసిఎఫ్ నిధులతో నగరంలో అభివృద్ధి పనులు ప్రారంభం చేసి ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, అధికారులు, పాల్గొన్నారు.



సామాజిక సేవ అభినందనీయం

ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్.

(కళాశ్రీ గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్) అక్టోబర్ 27.

వెలమ సంక్షేమ మండలి జగిత్యాల ఆధ్వర్యంలో, సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ వారి సౌజన్యంతో నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని జగిత్యాల పద్మనాయక ఫంక్షన్ హాల్ లో ప్రారంభించిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్ సురేందర్ రావు, కె డి సి సి జిల్లా సభ్యులు రామచందర్ రావు,వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సాగర్ రావు,ప్రధాన కార్యదర్శి వేణు గోపాల్ రావు,పాక్స్ చైర్మెన్ లు దామోదర్ రావు సందీప్ రావు,ఏ ఎం సి చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి, మాజీ అధ్యక్షులు పురుషోత్తం రావు, కౌన్సిలర్ దుమాల రాజ్ కుమార్, పెండెం రాములు,బాల ముకుందం, శరత్ రావు,ములసపు మహేష్ ,ప్రవీణ్ రావు,కార్యవర్గ సభ్యులు వైద్యులు పాల్గొన్నారు.

అచ్చలాపూర్‌లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

నీటిని వృథా చేయొద్దు.. ప్రతి చుక్కను పొదుపు చేయాలి

(రాంపెల్లి చంద్రశేఖర్ ప్రజాతీర్పు తాండూర్ మండలం రిపోర్టర్) అక్టోబర్ 27



తాండూర్: తాండూర్ మండలంలోని అచ్చలాపూర్ గ్రామంలో పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. సర్పంచ్ మారిశెట్టి స్రవంతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మల్టీపర్పస్ వర్కర్లు గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు.ఈ సందర్భంగా గ్రామస్తులకు నీటి పొదుపుపై ప్రత్యేక అవగాహన కల్పించారు. నీటిని వృథా చేయకుండా ప్రతి చుక్కను పొదుపు చేయాలని సూచించారు. కుళాయిల నుంచి నీరు వృథాగా కారకుండా ప్రతి ఇంట్లో ట్యాపులు సక్రమంగా బిగించుకోవాలని కోరారు. చిన్నపాటి నిర్లక్ష్యంతో కూడా పెద్ద మొత్తంలో నీరు వృథా అవుతుందని, భవిష్యత్ తరాలకు నీటి కొరత రాకుండా ప్రతి ఒక్కరూ నీటి పొదుపులో భాగస్వాములు కావాలని సూచించారు.గ్రామంలో పరిశుభ్రతను కాపాడటంతో పాటు నీటి వనరులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. గ్రామస్తులు పరిసరాల్లో చెత్తాచెదారం వేయకుండా పరిశుభ్రతను కాపాడేందుకు, నీటిని వృథా చేయకుండా పొదుపు చేసేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కల్పన, మల్టీపర్పస్ వర్కర్లు పాల్గొన్నారు.

టీజీఎన్‌పీడీసీఎల్ అద్దె వాహన యజమానులు, డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

- నవంబర్ 1 నుంచి సమ్మెకు యజమానులు, డ్రైవర్ల సంఘం పిలుపు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అక్టోబర్ 27 ప్రజా తీర్పు



టీజీఎన్‌పీడీసీఎల్ సంస్థలో అద్దె వాహనాల ద్వారా సేవలందిస్తున్న వాహన యజమానులు, డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని టీజీఎన్‌పీడీసీఎల్ అద్దె వాహన యజమానులు, డ్రైవర్ల సంఘం డిమాండ్ చేసింది. గత కొన్ని సంవత్సరాలుగా సంస్థలో పనిచేస్తున్న అద్దె వాహనాల యజమానులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. ప్రస్తుతం ఉన్న డీజిల్ ధరలు పెరగడంతో పాటు వాహనాల నిర్వహణ ఖర్చులు, మరమ్మతుల వ్యయాలు పెరిగాయని సంఘం పేర్కొంది. మరోవైపు డీజిల్ రేట్లు, ఇతర ఖర్చులు పెరిగినప్పటికీ వాహనాల అద్దె రేట్లు పెరగకపోవడంతో యజమానులు ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపింది. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా అద్దె రేట్లను పెంచి తమకు న్యాయం చేయాలని కోరింది. వాహన యజమానులు, డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని సంఘం విజ్ఞప్తి చేసింది. సమస్యల పరిష్కారం కోసం పలుమార్లు కోరినా తగిన స్పందన లేకపోవడంతో నవంబర్ 1, 2026 నుంచి సమ్మె చేపట్టాలని నిర్ణయించినట్లు పోస్టర్ ద్వారా ప్రకటించింది. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించి, పెరిగిన డీజిల్ ధరలు, నిర్వహణ ఖర్చులకు అనుగుణంగా అద్దె రేట్లు పెంచాలని సంఘం డిమాండ్ చేసింది. అధికారులు వెంటనే స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరింది.

పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం: జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.

పోలీస్ అమరవీరుల ఆత్మశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు

(బుగ్గ కృష్ణమూర్తి శర్మ ప్రజాతీర్పు) సిరిసిల్ల అక్టోబర్ 27



పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం సిరిసిల్ల పట్టణ పరిధిలోని స్థానిక హెబ్రోసు చర్చిలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సమాజ రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధులు నిర్వర్తిస్తూ ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని చర్చి పాస్టర్లు, ఫాదర్లతో కలిసి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని తెలిపారు. అమరవీరుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని, వారి సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తుందని పేర్కొన్నారు. ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యాలు కలగాలని, సమాజంలో మతసామరస్యం, శాంతిసామరస్యాలు వెల్లివిరియాలని చర్చి ప్రతినిధులతో కలిసి ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంట డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ శ్రీనివాస్, చర్చి పాస్టర్లు, ఫాదర్లు పాల్గొన్నారు.

రక్తదానం మరొకరి ప్రాణాన్ని కాపాడే మహోన్నత సేవ

- పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో రక్తదాన శిబిరం: సీపీ గౌష్ ఆలం, ఐపీఎస్

(ఇమ్రాన్ జోహ్రా, ప్రజాతీర్పు, కరీంనగర్) అక్టోబర్ 27



ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 47 మంది పోలీస్ అమరవీరులు

రక్తదానం మరొకరి ప్రాణాన్ని కాపాడే మహోన్నత సేవ అని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఆయన ఆదేశాల మేరకు మంగళవారం కరీంనగర్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ మానవతా దృక్పథంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, ప్రజల ప్రాణాలను రక్షించడం పోలీసుల ప్రధాన కర్తవ్యమని, అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో రక్తం అందించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానానికి కులం, మతం, ప్రాంతం, లింగభేదాలతో సంబంధం లేదని, ఇది మానవత్వానికి, సమానత్వానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో గాయపడిన వారికి రక్తం అందించడం ఎంతో కీలకమని తెలిపారు. రక్తదానం చేసే ముందు వైద్య పరీక్షలు చేయించుకోవాలని, రక్తదానం అనంతరం వైద్యుల సూచనల మేరకు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇప్పటివరకు 47 మంది పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించారని పేర్కొన్నారు. వారి త్యాగాలు చిరస్మరణీయమని, అమరవీరుల కుటుంబాలను గౌరవించడం, వారి సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ రక్తదాన శిబిరంలో ఏసీపీలు శ్రీనివాస్, శ్రీనివాస్ జి, వెంకటస్వామి, విజయకుమార్, స్వామి పాల్గొన్నారు. శిబిరానికి సహకరించిన ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉషారాణి, ఆర్ఎంఓ, వైద్య బృందానికి, స్వచ్ఛందంగా రక్తదానం చేసిన వారందరికీ పోలీస్ శాఖ తరఫున సీపీ గౌష్ ఆలం కృతజ్ఞతలు తెలిపారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ రక్తదాన శిబిరం మానవతా సేవకు, సమాజం పట్ల బాధ్యతకు ప్రతీకగా నిలిచింది.

ఐఐటీ బాంబేలో విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- డైరెక్టర్ శిరీష్ కేదారే రాజీనామా చేయాలి: ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్

(ఇమ్రాన్ జోహ్రా, ప్రజాతీర్పు, కరీంనగర్) అక్టోబర్ 27



దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ఒకటైన ఐఐటీ బాంబేలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కరీంనగర్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. విద్యార్థుల సమస్యలపై యాజమాన్యం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఐఐటీ బాంబే డైరెక్టర్ శిరీష్ కేదారే నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ కోరారు. మంగళవారం కరీంనగర్ మంకమ్మతోటలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత 13 నెలల్లో నలుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారన్న వార్తలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భద్రత, మానసిక ఆరోగ్య సహకారం అందించాల్సిన విద్యాసంస్థలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు. సాహిల్ వాకోడే మరణం విషయంలో ఐఐటీ బాంబే యాజమాన్యం వ్యవహరించిన తీరుపై ఆయన విమర్శలు చేశారు. పూర్తిస్థాయి విచారణ జరగకముందే సాహిల్‌పై ఆరోపణలతో ప్రకటన విడుదల చేయడం బాధ్యతారాహిత్యమని అభిప్రాయపడ్డారు. ఈ ఘటనపై నిష్పక్షపాత విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

నిరసన చేస్తున్న విద్యార్థులతో చర్చలు జరపాలి

తమ సమస్యల పరిష్కారం కోసం నిరసన తెలుపుతున్న విద్యార్థులతో చర్చలు జరపాల్సిన యాజమాన్యం, వారిని నిర్బంధించడం, నిరసన స్థలాన్ని తొలగించడం వంటి చర్యలకు పాల్పడటం సరికాదని శ్రీకాంత్ అన్నారు. విద్యార్థులకు చెందిన ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, మందులు, పుస్తకాలు, గదుల తాళాలు, ఇతర అవసరమైన వస్తువులను వెంటనే తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా నిరసనలను అణచివేయాలని చూడటం ప్రజాస్వామ్య హక్కులకు విరుద్ధమని పేర్కొన్నారు. విద్యార్థుల అభిప్రాయాలను గౌరవించి, వారి సమస్యలపై సానుకూలంగా స్పందించాలని యాజమాన్యానికి సూచించారు. క్యాంపస్‌లో భద్రత, మానసిక ఆరోగ్య సేవలు కల్పించాలి విద్యార్థులకు మెరుగైన మానసిక ఆరోగ్య సేవలు అందించాలని, క్యాంపస్‌లో సమానత్వం, భద్రతతో కూడిన విద్యా వాతావరణాన్ని కల్పించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంతో పాటు, నిరసనల్లో పాల్గొన్న వారిపై కక్షసాధింపు చర్యలు తీసుకోకూడదని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా విద్యాసంస్థలు విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని, బాధితులకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ కరీంనగర్ జిల్లా కమిటీ కోరింది. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఇసాక్, ఆకాష్, సురేష్, జిల్లా కమిటీ సభ్యులు రక్షక, నరేష్, సంతోష్, నాయకులు రిషి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌లో ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరు నమోదు అవగాహన సదస్సు

హైదరాబాద్, అక్టోబర్ 27 (ప్రజా తీర్పు)

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ఆదేశాల మేరకు హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద ఈరోజు ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరు నమోదు, ఓటు హక్కుపై అవగాహన సదస్సును నిర్వహించారు. సీనియర్ నాయకులు చామల లావ కుమార్ మరియు రాచకొండ మల్లేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి తెలంగాణ రక్షణ సేన అభ్యర్థిగా బరిలో ఉన్న డాక్టర్ నాళ్ల మాస్ శ్రీకాంత్ గౌడ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు.పట్టభద్రులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడంతో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ, నమోదు ప్రాముఖ్యతను వివరించారు. ప్రజాస్వామ్యంలో పట్టభద్రుల ఓటు కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదుపై బాధ్యతతో వ్యవహరించాలని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని పట్టభద్రులకు అవగాహన కల్పించారు.





ఎస్ ఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమం

నర్సంపేట అక్టోబర్ 27 ప్రజా తీర్పు ప్రతినిధి

నర్సంపేట పట్టణంలోని ఎస్ ఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో మంగళవారం సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నర్సంపేట సీఐ ఎం. శ్రీనివాస్, నూతన ఎస్ఐ నిహారిక హాజరై విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వాటిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు చదువుపై దృష్టి సారించి, మొబైల్ ఫోన్ల వినియోగాన్ని తగ్గించాలని తెలిపారు. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను అవసరమైన మేరకే ఉపయోగించాలని, అపరిచిత వ్యక్తులు పంపించే లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దని హెచ్చరించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ అడిగినా చెప్పకూడదని, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. తమ బ్యాంకు ఖాతాల్లోకి తెలియని వ్యక్తుల నుంచి డబ్బులు జమ అయితే వాటిని స్వయంగా తిరిగి పంపకుండా వెంటనే బ్యాంకు అధికారులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఆన్‌లైన్ మోసాలు, నకిలీ బహుమతుల ప్రకటనలు, ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నిహారిక మాట్లాడుతూ, సైబర్ నేరగాళ్లు వివిధ పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు పంచుకోవద్దని తెలిపారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే భయపడకుండా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో 112 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో డబ్బులు పోగొట్టుకున్నప్పుడు ఆలస్యం చేయకుండా ఫిర్యాదు చేస్తే డబ్బుల బదిలీని అడ్డుకునే అవకాశం ఉంటుందని వివరించారు.విద్యార్థులు సైబర్ భద్రతా నియమాలను పాటిస్తూ తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా అవగాహన కల్పించాలని పోలీసు అధికారులు సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు సురక్షితమైన మొబైల్ వినియోగం, వ్యక్తిగత సమాచార రక్షణ, సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొయ్యడి సనత్ కుమార్, పారామెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శిరీష, వైస్ ప్రిన్సిపాల్ సూరయ్య, సంతోష్, వెంకన్న, రమేష్ నాయక్, లయన్ ప్రవీణ్, హరి భూషణ్, సందీప్, శ్వేత, నజీమా, కుమార్, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ,స్వాతంత్ర సమరయోధుడు కీర్తిశేషులు పెద్దలు పెండెం కట్టయ్య 29వ వర్ధంతి సందర్భంగా..

నర్సంపేట అక్టోబర్ 27 ప్రజా తీర్పు ప్రతినిధి



నర్సంపేట పట్టణం విశ్వకర్మ మాజీ అధ్యక్షులు దేవోజు సదానందం . టిపిసిసి. సభ్యులు పెండెం రామానంద్ ఉ నర్సంపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పంబి వంశీకృష్ణ . తో కలిసి పెండెం కట్టయ్య విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది... ఈ సందర్భంగా నర్సంపేట పట్టణ విశ్వకర్మ మాజీ అధ్యక్షులు దేవోజు సదానందం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెద్దలు పెండెం కట్టయ్య కాంగ్రెస్ పార్టీ కోసం వారు చేసిన సేవలను వారి కృషిని మరువలేనిదని అన్నారు.. నర్సంపేటలో కాంగ్రెస్ పార్టీ పట్టుదలతో ఉన్నదంటే ఆయన చేసిన కృషి ఫలితమే..కావున ఆయన అడుగుజాడల్లో నిలిచి కాంగ్రెస్ పార్టీని మరింత ఎత్తుకు ఎదిగే విధంగా మనమందరం ఆయన చూపించిన మార్గంలో,వారి ఆశయాలకు అనుగుణంగా నడవాలని మరియు కాంగ్రెస్ పార్టీ పేదల ప్రజలకు చేస్తున్న ప్రతి పనిని ప్రజల్లోకి తీసుకువెళ్లే విధంగా విధంగా ప్రతి నాయకుడు కార్యకర్త పట్టుదలతో పనిచేయాలని సీనియర్ నాయకులు పెండం కట్టయ్య ఆశయాలను నెరవేర్చాలని కోరారు.. వారి తాత పెండెం కట్టయ్య కలలను సహకారం చేస్తూ వారి మనుమడు పెండెం రామానంద్ . పి సి సి మెంబర్ గా అంచలంచలు ఎదుగుతూ వారి సతీమణి పెండెం శ్రీ లక్ష్మీ ని ఒకసారి కౌన్సిలర్ గా.. ప్రస్తుతం మున్సిపల్ చైర్ పర్సన్ గా నర్సంపేట అభివృద్ధి ప్రదాత శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి సహకారంతో పట్టణ ప్రజలకు అందుబాటులో ఉంటూ నర్సంపేట పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లడం జరుగుతుందని అన్నారు.. నర్సంపేట పట్టణ మాజీ విశ్వకర్మ అధ్యక్షులు.దేవోజు సదానందం.

కేసీఆర్ తో ఎమ్మెల్యే జిఎంఆర్ భేటీ..

సోదరుడి కుమారుడి నిశ్చితార్థానికి ఆహ్వానం..

పటాన్చెరు, అక్టోబర్ 27,ప్రజా తీర్పు

తెలంగాణ తొలి ముఖ్యమంత్రివర్యులు, బిఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు ని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం సాయంత్రం ఎర్రవల్లి లోని కెసిఆర్ ఫామ్ హౌస్ లో.. రాష్ట్ర మాజీ మంత్రివర్యులు, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు తో కలిసి. కేసీఆర్ ని కలిశారు. ఈ సందర్భంగా ఈ నెల 30వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న తన సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి కుమారుడు గూడెం సందీప్ రెడ్డి నిశ్చితార్థ వేడుకకు హాజరు కావాలని కేసీఆర్ ని ఎమ్మెల్యే జిఎంఆర్ ఆహ్వానించారు. అనంతరం విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని కెసిఆర్ కి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

టీయూవీ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులుగా గద్దల ధర్మేందర్ నియామకం

(వీ వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) అక్టోబర్ 27

తెలంగాణ ఉద్యమకారుల వేదిక మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులుగా హనుమాన్ బస్తికి చెందిన గద్దల ధర్మేందర్ నియామకం అయ్యారు. టీయూవీ రాష్ట్ర చైర్మన్ నరాల సత్యనారాయణ జారీ చేసిన నియామక పత్రంను మంగళవారం జిల్లా అధ్యక్షులు గోగర్ల రాజేశం దర్మేందర్ కు అందజేశారు. ఈ సందర్భంగా గద్దల ధర్మేందర్ మాట్లాడుతూ బెల్లంపల్లిలో నిజమైన ఉద్యమకారులను గుర్తించి ప్రభుత్వ హామీలను వారికి అమలు చేసేంత వరకు పోరాడుతాం అని అన్నారు

కన్నుల పండవ గా శ్రీ వేంకటేశ్వరస్వామి రథోత్సవం..

పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 27 ప్రజాతీర్పు



గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలోని శ్రీ హరిహర దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్స వాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన రథోత్సవానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారిని దర్శించు కుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పాపారావు, వేద పండితులు రాధాకృష్ణ శర్మ, రామాచారి, సప్తగిరి, సుధాకర్ శర్మ తదితరులు వేదమంత్రాలు, పూర్ణకుంభం, మంగళవాయిద్యాల నడుమ ఆది శ్రీనివాస్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన వేద పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. ఆలయ కమిటీ తరఫున చైర్మన్ పాపారావు తీర్థప్రసాదాలు అందజేశారు.

భక్తిశ్రద్ధల నడుమ రథోత్సవం

శ్రీ వేంకటేశ్వరస్వామిని గరుడ వాహనంపై అలంకరించి, మంగళవాయిద్యాలు,భాజాభజంత్రీలు, భజనల నడుమ గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఈ వేడుకలలో గంభీరావుపేట మండలంతో పాటు వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. రథోత్సవం సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హమీద్, సహకార సంఘం చైర్మన్ వేషాల వెంకటి, లింగన్నపేట గ్రామ సర్పంచ్ పిట్ల ఎల్లయ్య, ఆలయ వైస్ చైర్మన్ జోగు సురేష్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, కొత్తపల్లి గ్రామ అధ్యక్షుడు మెండే భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ బందోబస్తు ఏర్పాటు

లింగన్నపేటలో జరిగిన శ్రీ వెంకటేశ్వర స్వామి రథోత్సవ వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఓదెల వెంకటేష్ ఆధ్వర్యంలో గంభీరావుపేట పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.



వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ మరుగుజ్జుల దినోత్సవ వేడుకలు

(మొక్క ఉపేందర్ ప్రజా తీర్పు ప్రతినిధి హైదరాబాద్) అక్టోబర్ 27:

ప్రపంచ మరుగుజ్జుల దినోత్సవం అసలు తేదీ అక్టోబర్ 25 ఆదివారం సెలవు కారణంగా ఈరోజు అక్టోబర్ 26న వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో మరుగుజ్జుల అసోసియేషన్ తరపున కేక్ కట్ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాకు అండగా నిలిచి, విజయవంతం చేయడానికి సహకరించిన పెద్దలు, మహిళలు, వికలాంగ సోదర సోదరీమణులందరికీ మా హృదయపూర్వక కృతజ్ఞతలు. మీ ప్రేమ, సపోర్ట్ వల్లే ఈ వేడుక ఇంత ఘనంగా జరిగింది.

ఎత్తు తక్కువైనా, మా ఆత్మవిశ్వాసం ఎంతో ఎత్తు!

మరుగుజ్జు సంఘం రాష్ట్ర అధ్యక్షులు. బుగ్గ మల్లేష్. ఉపాధ్యక్షులు. సైదులు యాదవ్ మహిళా అధ్యక్షురాలు. పద్మ, అరుణ, ఇందిరా,రహీం, నాగేంద్ర, శ్రీనివాస్, వివిధ సంఘాల లీడర్లు మహిళలు పాల్గొనడం జరిగింది.

న్యాయం కోసం బాధితుల ఆవేదన

- రూ.85 లక్షల ఇంటిపై వివాదం.. రూ.39 లక్షలకే దక్కించుకునే యత్నం
- అగ్రిమెంట్.. బ్యాంకు బిడ్డింగ్‌పై విచారణ జరపాలని బండం చంద్రశేఖర్ దంపతుల విజ్ఞప్తి

మంథని, అక్టోబర్ 27 (ప్రజాతీర్పు)



కష్టపడి నిర్మించుకున్న ఇంటిని కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని మంథనికి చెందిన బండం చంద్రశేఖర్, సుప్రియ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మంథని డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఇంటి విలువ రూ.85 లక్షలుగా పేర్కొంటూ అగ్రిమెంట్ చేసుకున్నప్పటికీ, మరోవైపు బ్యాంకు వేలంలో రూ.39 లక్షలకే దక్కించుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ వ్యవహారంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జోక్యం చేసుకొని న్యాయం చేయాలని వారు కోరారు. 2015--2017 మధ్య సోలార్ కంపెనీలో పనిచేసిన సమయంలో కార్మికుల పీఎఫ్ వివాదంతో తనపై కేసు నమోదైందని తెలిపారు. పెద్దల సమక్షంలో జరిగిన పంచాయితీలో రూ.5 లక్షలు చెల్లించినని అయినా కేసు ఉపసంహరించుకోలేదన్నారు. తర్వాత పోలీసులు కేసును కొట్టివేసినట్లు తెలిపారు. 2021లో ఇంటి స్థలం కొనుగోలు చేసి నిర్మాణం చేపట్టినట్లు వారు తెలిపారు. ఇంటిపై తీసుకున్న రుణానికి ఈఎంఐలు చెల్లించకపోవడంతో ఫైనాన్స్ సంస్థ ఇంటిని సీజ్ చేసిందన్నారు. ఈ పరిస్థితుల్లో ఇంటి విలువ రూ.85 లక్షలుగా పేర్కొంటూ, రూ.10 లక్షలు అడ్వాన్స్ ఇచ్చినట్లు చూపిస్తూ అగ్రిమెంట్ రాయించుకున్నారని వారు తెలిపారు. అయితే తనకు ఎలాంటి అడ్వాన్స్ అందలేదని, మిగిలిన మొత్తాన్ని కూడా చెల్లించలేదని వాపోయారు. ఆకుల కిరణ్ తనను బెదిరించినట్లు కూడా ఆరోపించారు. తనకు నోటీసులు ఇవ్వకుండానే ఆకుల కిరణ్ తన తమ్ముడు ఆకుల సంజీవ్ పేరుతో ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా రూ.39 లక్షలకు ఇంటిని దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. అగ్రిమెంట్‌లో పేర్కొన్న చెల్లింపులు జరిగాయా? బ్యాంకు వేలం నిబంధనల ప్రకారం సాగుతోందా? బాధితుడికి నోటీసులు అందాయా? అనే అంశాలపై విచారణ జరపాలని కోరారు. తన సమస్యను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదని చంద్రశేఖర్ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు.

రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం..

పటాన్చెరు :అక్టోబర్ 27 ప్రజా తీర్పు

పల్లె నుండి పట్నం వరకు నిత్యం ప్రజలతో సంబంధాలు కలిగి ఉండే రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని.. సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే రాష్ట్ర రాజధాని లో భారీ నిరసన కార్యక్రమం చేపడతామని పటాన్చెరు శాసన సభ్యులు, రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన.. రాష్ట్ర స్థాయి గౌరవ వేతన సాధన సభ, రాష్ట్ర కమిటీ ప్రమాణస్వీకారం మహోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర మాజీ మంత్రి సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావుతో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి విపత్తుల సంభవించిన, కరోనా లాంటి మహమ్మారి మూలంగా లక్షలాదిమంది చనిపోయిన సమయంలోనూ ప్రాణాలకు తెగించి ప్రజలకు నిత్యవసర వస్తువులు అందించడంలో రేషన్ డీలర్ల పాత్ర శ్లాగనీయమన్నారు. క్షేత్రస్థాయిలో రేషన్ డీలర్లు వివిధ సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రేషన్ డీలర్లకు



ఇచ్చిన ప్రధాన హామీలను వెంటనే అమలుపరచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో డీలర్ల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో లక్ష మందితో కలిసి రాష్ట్ర రాజధానిలో భారీ నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. అమలుకు సాధ్యం కానీ హామీలు ప్రకటించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. వాటిని అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. రేషన్ డీలర్ల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పర్ల శాసనసభ్యులు అనిరుద్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, మాజీ శాసనసభ్యులు ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాయికోటి రాజు, సంఘం ప్రతినిధులు, రేషన్ డీలర్లు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



మెదక్‌లో రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ ఆందోళన

మెదక్, అక్టోబర్ 27,(ప్రజా తీర్పు ప్రతినిధి):

కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మెదక్ పట్టణంలో బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. మెదక్ జిల్లా అధ్యక్షుడు వల్దాస్ మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే చిత్రపటాలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ.. సరైన సమాచారం, ఆధారాలు లేకుండా రాహుల్ గాంధీ పదేపదే 'ఓటు చోరీ' అంటూ పొంతనలేని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. నిజంగా ఓట్ల చోరీ జరిగితే ఎక్కడ, ఎలా జరిగిందో స్పష్టమైన సాక్ష్యాధారాలతో నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు. ఆధారాలు లేకుండా ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేయడం తగదని పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కర్ణం ప్రణీత, జిల్లా ప్రధాన కార్యదర్శులు సంగసాని సురేష్, రంజిత్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఖాజీపేట రాజేందర్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు బైండ్ల సత్యనారాయణ, స్టేట్ కౌన్సిల్ మెంబర్ రాగి రాములు, రాష్ట్ర నాయకుడు కాశీనాథ్, మెదక్ దిశ కమిటీ సభ్యుడు రమేష్ గౌడ్, జిల్లా కార్యదర్శి కల్కి నాగరాజు, మహిళా మోర్చా నాయకురాలు శైలజ గౌడ్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాలరాజు, మండల అధ్యక్షులు నాయిని ప్రసాద్, సంతోష్, వీణ, హరీష్, దాస్, నాగేందర్ రెడ్డి, సిద్ధిరాం రెడ్డి, అవినాష్ రెడ్డి, నర్సాపూర్ పట్టణ బీజేపీ కన్వీనర్ ప్రేమ్ కుమార్ యాదవ్, భిక్షపతి, సీనియర్ నాయకులు నల్లాల విజయ్, భరత్ కుమార్, లోకేష్, పబ్బ లక్ష్మణ్, అల్లం మధు, బెండల స్వామి, ఆకుల ప్రభాకర్, శ్యామ్‌తో పాటు వివిధ మోర్చాల నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



జమ్మికుంటలో ఘనంగా బుర్ర సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలు

జమ్మికుంట, అక్టోబర్ 27 ప్రజాతీర్పు

తెలంగాణ క్యాపిటల్ గ్రూప్ ఆఫ్ మీడియా, బి ఎస్ కే ఫౌండేషన్ చైర్మన్, నవ తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బుర్ర సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలను కరీంనగర్ జిల్లా జమ్మికుంట కేంద్ర పట్టణంలోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంక్షేమం కోసం, పేద విద్యార్థులకు అండగా నిలుస్తూ వారికి చేయూత అందిస్తున్న బుర్ర సంజయ్ కుమార్ సేవలను పలువురు కొనియాడారు. అనంతరం వందేళ్ల చరిత్ర కలిగిన బొమ్మల గుడిలో అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు, ప్రజలకు అన్నదానం చేయడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తూ, పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్న బుర్ర సంజయ్ భవిష్యత్తులో మరెన్నో పదవులు పొంది ఉన్నతమైన స్థాయిని అధిరోహించి ప్రజలకు సేవా చేస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ జన్మదిన వేడుకల్లో నవ తెలంగాణ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మ వెంకటేష్, పిడి ఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు తదితరులు పాల్గొని బుర్ర సంజయ్ కుమార్ కి జన్మదిన శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజేష్, రక్షిత్, సాయి, సత్య, అభిలాష్,సాయి, బన్నీ,నిఖిల్,రఘు,సోఫియన్,రోహిత్, రంజిత్, సందీప్, శివ,పృథ్వీరాజ్, రమణసాయి,ఆశిష్, శ్రీనివాస్, విష్ణువర్ధన్,రాజు,కుమార్ ,తదితరులు పాల్గొన్నారు.



సింగరేణి ఇల్లందు ఏరియాలో సైబర్ సెక్యూరిటీ అవగాహన సదస్సు

(పానకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు ఇల్లందు) అక్టోబర్ 27

ఇల్లందు :సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, ఇల్లందు ఏరియా ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక వైసిఓఏ క్లబ్‌లో సైబర్ సెక్యూరిటీ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ నిర్వహించారు.ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఓ టు జీఎం జాకీర్ హుస్సేన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐటీ మేనేజర్ చైతన్య పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సైబర్ భద్రతపై ఉద్యోగులు, అధికారులకు అవగాహన కల్పించారు. బలమైన పాస్‌వర్డ్‌లను వినియోగించడం, అనుమానాస్పద ఫిషింగ్ ఈ-మెయిల్స్ పట్ల అప్రమత్తంగా ఉండటం, నమ్మకమైన వనరుల నుంచే ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం, కంప్యూటర్ సిస్టమ్స్ మరియు సాఫ్ట్‌వేర్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయడం, అధికారిక సమాచారాన్ని భద్రంగా ఉంచడం, సింగరేణి భద్రతా విధానాలను పాటించడం, అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావడం వంటి ముఖ్యమైన అంశాలను వివరించారు.ఈ సందర్భంగా జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల కూడా కీలకమైన సమాచారం ఇతరుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని, అందువల్ల ప్రతి ఉద్యోగి సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బలమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించడం, తెలియని లింక్‌లను క్లిక్ చేయకపోవడం, అనుమానాస్పద ఈ-మెయిల్స్‌కుస్పందించక పోవడం, సంస్థకు సంబంధించిన సమాచారాన్ని గోప్యంగా ఉంచడం వంటి జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. సైబర్ మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉంటూ, సురక్షితమైన డిజిటల్ విధానాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం, సైబర్ భద్రతపై నిర్వహించిన అవగాహన పరీక్షలో మొత్తం 20 మార్కులకు గాను ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని గుర్తించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) శ్రీ అజ్మీర తుకారం, డీజీఎం (ఐటీ) శ్రీ ప్రభాకర్ రావు, డిప్యూటీ సీఎంఓ డాక్టర్ శారదా దేవి, శ్రీ పులి పూర్ణచంద్రరావు, దిలీప్ కుమార్, శ్రీ రామ్మూర్తి, శ్రీ వినయ్ సాగర్, ఆర్.ఎం. శ్రీ వెంకటేశ్వర్లు, శ్రీ దామోదర్, శ్రీ దేవేందర్ నాయక్ తదితర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



చక్కని ప్రణాళికతో ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలి

(వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్ అక్టోబర్ 27)

ప్రభుత్వశీ కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అందుకోవాలని సిద్ధిపేట జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కలకొండ రవీందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం కోహెడ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు, బ్యాగులు బూట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కళాశాలకు సక్రమంగా హాజరై ప్రభుత్వం కల్పించిన వసతులను వినియోగించుకుని,వార్షిక ఫలితాలలో కళాశాలను జిల్లా లో ప్రథమ స్థానంలో నిలుపాలని అన్నారు. చక్కని భవిష్యత్తు కోసం మంచి లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళిక బద్దంగా అందుకు కృషి చేయాలని అన్నారు. తద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలను అందుకుని తల్లి దండ్రులకు కళాశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ కళాశాలల బలోపేతానికి చేస్తున్న కృషికి రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థుల జీవితంలో ముందడుగు వేయడానికి ఇలాంటి ప్రోత్సాహకాలు తోడ్పడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కోతి యాదగిరి వి రాజమౌళి ఎస్ రాజేశ్వర్ రెడ్డి ఎస్ శ్రీనివాస్ కే రజిత వెంకటరెడ్డి బి సుజాత యమ్ నీరజ యు శ్రీనివాస్ కే అశోక్ వి నరేష్ ఏ సీతారామయ్య చిరంజీవి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

బిజెపి తెలంగాణ రాష్ట్ర ఐటీ కో కన్వీనర్ గా కేశవ్ సోనీ

(పీ వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) అక్టోబర్ 27



బిజెపి తెలంగాణ రాష్ట్ర ఐటీ విభాగానికి కో కన్వీనర్ గా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణానికి చెందిన కేశవ్ సోనీ నియమితులయ్యారు.గతంలో ఏబీవీపీలో నగర సహాయ కార్యదర్శి గా, భాగ్ కన్వీనర్ గా, జోనల్ ఇన్చార్జిగా,టెక్నికల్ సెల్ జిల్లా కన్వీనర్ గా, విభాగ్ కన్వీనర్ గా,రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, సమరత్ భారత్ దక్షిణ బెంగళూరు కోఆర్డినేటర్ గా, స్వదేశీ జాగరణ మంచ్ తెలంగాణ ప్రాంత ప్రచార ప్రముఖ్ గా, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కేంద్ర కమిటీ సభ్యునిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సందర్భంగా కేశవ్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో నాకు ఈ బాధ్యతను అప్పగించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావుకి, రాష్ట్ర సంఘటనా మంత్రి మధుకర్ జి కి ధన్యవాదాలు తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా నరేంద్ర మోడీ నాయకత్వంలో పనిచేస్తామని,తెలిపారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన కేశవ్ కి రాష్ట్రస్థాయిలో బిజెపిలో కీలకమైన బాధ్యతలు రావడం పట్ల బెల్లంపల్లి పట్టణ,నియోజకవర్గ ప్రజలు మంచిర్యాల జిల్లా ప్రజలు బిజెపి,ఏబీవీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.



జాతీయ స్థాయి క్రికెట్‌కు ఎంపికైన పల్లవికి జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ ఆర్థిక సహాయం

- బాలిక ఎంపిక హర్షణీయం..
- క్రీడాకారులను ప్రోత్సహిస్తాం – ఎస్పీ నరసింహ ఐపీఎస్


(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) అక్టోబర్ 27

సూర్యాపేట జిల్లా నుంచి తెలంగాణ రాష్ట్రం తరఫున జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన పల్లవిని ప్రోత్సహిస్తూ సూర్యాపేట జిల్లా పోలీసు శాఖ తరఫున జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఆర్థిక సహాయం అందించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పల్లవికి నగదు సహాయం అందించి అభినందించారు. కుడకుడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పల్లవి 17 సంవత్సరాల బాలికల క్రికెట్ జట్టుకు తెలంగాణ రాష్ట్రం తరఫున జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొనేందుకు ఎంపికైంది. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎంఎస్‌కే ప్రసాద్ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న పల్లవి ఇటీవల నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావడం పట్ల ఎస్పీ హర్షం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించడంలో భాగంగా జిల్లా పోలీసు శాఖ తరఫున ఆర్థిక సహాయం అందించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ.. పల్లవి జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి మరిన్ని విజయాలు సాధించాలని, సూర్యాపేట జిల్లాకు, శిక్షణనిచ్చిన కోచ్‌లకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడల్లో ప్రతిభ చూపే యువతను ప్రోత్సహించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక కావడం పల్లవి కృషి, పట్టుదలకు నిదర్శనమని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, వెల్ఫేర్ ఆర్ఎస్ఐ సాయిరాం, కోచ్ లు ఉన్నారు.

ఎల్ నినో ప్రభావాన్ని సమిష్టిగా అధిగమిద్దాం

- రైతులు వరి సాగు చేయవద్దు
- రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరీమాఅగ్రవాల్

(బుగ్గ కృష్ణమూర్తి శర్మ ప్రజాతీర్పు)
సిరిసిల్ల, అక్టోబర్ -27



సూపర్ ఎల్ నినో ప్రభావం, ప్రత్యామ్నాయ ప్రణాళిక తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షపాతం, రానున్న మూడు నెలల్లో వర్షపాతం, నీటిపారుదల, వివిధ పంటల సాగు తదితర శాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఈ ఏడాది జిల్లాలో వర్షాలు తక్కువగా కురిసాయని, రానున్న మూడు నెలల్లో వర్షాలు పడే అవకాశం లేదని వాతావరణ శాఖ నివేదిక తెలిపిందని వెల్లడించారు. ఎగువ మానేరు, మధ్య మానేరు, అన్నపూర్ణ, మల్కపేట రిజర్వాయర్లలో నీటిమట్టాలు ప్రస్తుతం ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రజలకు తాగునీరు, మూగజీవాలకు మాత్రమే వినియోగించడానికి ఉన్నాయని తెలిపారు. ఒక ఎకరంలో వరి సాగు చేయాలంటే 35 నుంచి 40 లక్షల లీటర్ల నీరు అవసరమని వెల్లడించారు. ఒక ఎకరంలో వరి సాగు చేసే నీటితో ఐదు నుంచి ఆరు ఎకరాల్లో ఆరు తడి పంటలు చేయవచ్చని తెలిపారు.ప్రస్తుత వేడి వాతావరణం తక్కువ వర్షాలు కురవడంతో భూగర్భ జలాలు రానురాను తగ్గుతున్నాయని వివరించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మిగతా జిల్లాలతో పోలిస్తే రాజన్న సిరిసిల్ల జిల్లాలో భూగర్భ జలాలు తక్కువగా ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికారుల సూచనలు మేరకు రైతులు ఈ యాసంగి సీజన్లో వరి వేయవద్దని సూచించారు. అధికారుల సూచన మేరకు పప్పు ధాన్యాలు, ఆయిల్ పామ్, కూరగాయలు, మొక్కజొన్న, నువ్వులు, పొద్దుతిరుగుడు తదితర పంటలు సాగు చేయాలని సూచించారు. ఈ మేరకు ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని ఆదేశించారు. భూగర్భ జలాలు తగ్గిపోతుండడంతో విద్యుత్ పై మరింత ఎక్కువ భారం పడి ఇబ్బందులు వచ్చే ప్రమాదం ఉందని స్పష్టం చేశారు. రైతులు నీరు, విద్యుత్తు తదితర అంశాలను దృష్టిలో పెట్టుకొని వరి సాగును చేయవద్దని సూచించారు. వచ్చే నెల నవంబర్ 30వ తేదీ వరకు జిల్లాలోని ఆయా మండలాల్లో కేతు బచావో అభియాన్ అలాగే సూపర్ ఎల్ నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ, నీటిపారుదల శాఖ, విద్యుత్ శాఖ ఏఈలు ప్రతి మంగళ, బుధవారాల్లో ఆయా సమావేశాలకు హాజరై ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నీటి మట్టాలు, విద్యుత్ వ్యవస్థ తదితర అంశాలపై రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

నూతన బోర్లు వేసేందుకు అనుమతి తప్పనిసరి

జిల్లాలో నూతనంగా బోర్లు వేసేందుకు తహసీల్దార్ వద్ద అనుమతి తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. వాల్టా చట్టం ప్రకారం అనుమతి లేకుండా జిల్లాలో ఎవరూ బోర్లు వేయవద్దని సూచించారు. ప్రతి గ్రామం, పట్టణంలో నీటి వృథాను అధికారులు అరికట్టాలని ఆదేశించారు. ప్రతి నల్లకు ఆన్ ఆఫ్ బటన్ ఉండాలని స్పష్టం చేశారు. మిషన్ భగీరథ, మున్సిపల్, గ్రామపంచాయతీ అధికారులు తమ పరిధిలో పర్యటించి నీటి వృథాను పర్యవేక్షించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. పశుసంవర్ధక శాఖ అధికారులు జీవాలకు అవసరమైన గడ్డి దాన సిద్ధంగా ఉండేలా చూసుకోవాలని, గడ్డి పెంచేందుకు కావలసిన విత్తనాలు ముందస్తుగా అందుబాటులో పెట్టారని ఆదేశించారు.

తెలంగాణ జలసిరి పనులు ముమ్మరంగా చేపట్టాలి

వీబీజీ రామ్ జీ కింద తెలంగాణ జలసిరి పనులను జిల్లాలో ముమ్మరంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఆయా పనులను చేపట్టడంతో కూలీలకు సైతం ఉపాధి దొరుకుతుందని వివరించారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంత తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. పామ్ పాండ్, బోర్వెల్ రీచార్జ్ గుంతలు, మ్యాజిక్ సోక్ పిట్, కమ్యూనిటీ ఇంకుడు గుంతలను ప్రణాళిక ప్రకారం చేపట్టి పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయ శ్రీ, మిషన్ భగీరథ ఎస్ ఈ రాములు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి అష్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, ఎన్ పీడీసీఎల్ ఎస్ఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల భద్రతపై ప్రతి ఒక్కరికీ బాధ్యత!

- పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన తప్పనిసరి.
- జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి బాలభాస్కర్.

మేడిపల్లి, అక్టోబర్ 27 (ప్రజాతీర్పు):



చిన్నారులపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు పోక్సో చట్టం--2012పై ప్రతి విద్యార్థికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి బాలభాస్కర్ అన్నారు. పిల్లల భద్రత విషయంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మంగళవారం బోడుప్పల్ జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన పోక్సో చట్టం అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారి ప్రియాంక, మేడిపల్లి పోలీస్ స్టేషన్ సీఐ డీ. జలేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలభాస్కర్ మాట్లాడుతూ చిన్నారులపై జరిగే లైంగిక నేరాలను నిరోధించేందుకు పోక్సో చట్టం పటిష్ఠమైన రక్షణ కల్పిస్తుందని వివరించారు. 18 సంవత్సరాల లోపు బాలబాలికలపై జరిగే లైంగిక నేరాలు ఈ చట్టం పరిధిలోకి వస్తాయని తెలిపారు. విద్యార్థులు తమకు ఎదురయ్యే ఇబ్బందులను భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. మంచి స్పర్శ, చెడు స్పర్శ మధ్య తేడాను గుర్తించేలా చిన్నారులకు అవగాహన కల్పించాలని, అనుచిత ప్రవర్తన ఎదురైనప్పుడు మౌనంగా ఉండకుండా వెంటనే విశ్వసనీయ పెద్దలకు తెలియజేయాలని పేర్కొన్నారు.

వేధింపులపై మౌనం వీడాలి..

లైంగిక వేధింపులు, బెదిరింపులు ఎదురైనప్పుడు విద్యార్థులు భయాందోళనలకు గురికాకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని పోలీసు అధికారులు సూచించారు. పిల్లల భద్రతకు సంబంధించిన చట్టపరమైన హక్కులు, పోక్సో చట్టంలోని ముఖ్య నిబంధనలు, నేరాలకు విధించే శిక్షల గురించి వివరించారు. చిన్నారులపై జరిగే వేధింపులను గుర్తించడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. పిల్లల ప్రవర్తనలో అకస్మాత్తుగా మార్పులు కనిపించినప్పుడు వారి సమస్యలను తెలుసుకునేందుకు ప్రయత్నించాలని సూచించారు.

మహిళలు, బాలికల రక్షణలో షీ టీమ్స్ కీలకం..

మహిళలు, బాలికల భద్రత కోసం పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు. వేధింపులను అరికట్టడంలో షీ టీమ్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. వేధింపులకు గురైనప్పుడు ఫిర్యాదు చేసే విధానం, పోలీసులను సంప్రదించాల్సిన పరిస్థితులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనుమానాస్పద ఘటనలు గమనించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పిల్లలపై లైంగిక నేరాల నివారణ కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులు పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో చట్టాలపై అవగాహన, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి జడ్జి : స్వరూప కాటం

(పానకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు ఇల్లందు అక్టోబర్) 27

ఇల్లందు :మంగళవారం ఇల్లందు పట్టణ సబ్ జైల్ ను సాయంత్రం ఇల్లందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ స్వరూప కాటం సందర్శించినారు, అనంతరం జైలు ఖైదీలతో మాట్లాడుతూ క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం వలన చర్యల వలన ఆయా కుటుంబాలు వారి జీవితాలు చిన్నాభిన్నం అవుతాయని మళ్లీ మళ్లీ తప్పులు చేయకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచనలు చేశారు.జైలు రికార్డులు,వంటశాలను ,ములకత్ గదులను, పరిసరాలను పరిశీలించారు. ఖైదీల మెనూనుపరిశీలించినారు. ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు ఫ్రీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ద్వారా న్యాయవాదిని నియమిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్జి గారితో లీగల్ ఎయిడ్ క్లినిక్ కీర్తి కార్తిక్ ,సబ్ జైల్ చీఫ్ బి.ఉదయ్ కుమార్ , హెడ్ వార్డెన్ భుజరంగరాజు, సాంబ, శ్రీనివాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఇల్లందు సింగరేణి ఏరియాలో కంపెనీ స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

(పానకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు, ఇల్లందు అక్టోబర్) 27

ఇల్లందు :సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాలో కంపెనీ స్థాయి వాలీబాల్ క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇల్లందు ఏరియా జనరల్ మేనేజర్ వి. కృష్ణయ్య హాజరై, క్రీడల జెండాను ఆవిష్కరించి పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన స్వయంగా వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ వి. కృష్ణయ్య మాట్లాడుతూ, క్రీడలు శారీరక దృఢత్వాన్నిపెంపొందించడంతో పాటు మానసిక ఉల్లాసం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణను పెంపొందిస్తాయని తెలిపారు. వాలీబాల్ ఒక జట్టు క్రీడ అని, ప్రతి క్రీడాకారుడు సమన్వయంతో, పరస్పర సహకారంతో ఆడినప్పుడే జట్టు విజయం సాధిస్తుందని పేర్కొన్నారు. వివిధ ఏరియాల నుంచిపాల్గొనేక్రీడాకారులందరికీ స్వాగతం పలుకుతూ, క్రీడాస్ఫూర్తితో, స్నేహభావంతో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. గెలుపోటములు క్రీడల్లో సహజమని, విజయం సాధించినప్పుడు అతిగా సంబరపడకుండా, ఓటమి ఎదురైనప్పుడు నిరుత్సాహపడకుండా సమానమైన మనోభావంతో ఉండేవారే నిజమైన క్రీడాకారులని అన్నారు. క్రీడలు ఉద్యోగుల మధ్య స్నేహసంబంధాలను బలోపేతం చేయడంతో పాటు ఐక్యత, జట్టుగా పనిచేసే నైపుణ్యాన్ని పెంపొందిస్తాయని వివరించారు. వాలీబాల్‌లో ఆటగాళ్ల మధ్య సమన్వయం, వేగంగా నిర్ణయాలు తీసుకోవడం, బంతిపై నియంత్రణ, సరైన సర్వీస్, బ్లాకింగ్, అటాకింగ్ నైపుణ్యాలు కీలకమని పేర్కొన్నారు. ప్రతి ఆటగాడు తన బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తూ జట్టు విజయానికి కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్‌వో టు జీఎం జాకీర్ హుస్సేన్, డీజీఎం (పర్సనల్) అజ్మీర తుకారాం, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ జి. సుధాకర్, డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ హ్యాండ్‌బాల్ సెక్రటరీ అశోక్, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ నజీర్ అహ్మద్, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ జె. వెంకటేశ్వర్లు, స్పోర్ట్స్ సూపర్‌వైజర్లు, రిఫరీలు, క్రీడాకారులు, ఉద్యోగులు పాల్గొఈ కార్యక్రమంలో ఎస్‌వో టు జీఎం జాకీర్ హుస్సేన్, డీజీఎం (పర్సనల్) అజ్మీర తుకారాం, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ జి. సుధాకర్, అశోక్, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ శ్రీ నజీర్ అహ్మద్, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ జె. వెంకటేశ్వర్లు, స్పోర్ట్స్ సూపర్‌వైజర్లు శ్రీనివాస్, అశోక్, పోస్నెట్, నరేందర్ రెడ్డి, రిఫరీలు శ్రవణ్, రమేష్, జి. వెంకటేశ్వర్లు, స్కోరర్లు జాకబ్, కాంతారావు, ప్రసాద్, ఔరా కోఆర్డినేటర్ కిషోర్, జనరల్ కెప్టెన్ బాబురావు, కమిటీ సభ్యులు, ఇతర అధికారులు, క్రీడాకారులు, ఉద్యోగులు పాల్గొన్నారు

ఒంగోలు నుండి తెలంగాణకు పక్షులు

ఆసక్తిగా తిలకించిన జనాలు

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 27 (ప్రజా తీర్పు):



ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్ల పేట గ్రామ శివారులో గల గంగమ్మ వాగులో ఒంగోలు నుండి వచ్చిన బాతులు ఒక్కసారిగా వందల సంఖ్యలో దర్శనమిచ్చాయి. దీంతో గ్రామ ప్రజలు ఆసక్తిగా వీటిని తిలకించారు. వందల సంఖ్యలో ఒంగోలు నుండి ఒక వ్యక్తి వీటిని రోడ్డు మార్గం గుండా తీసుకురావడంతో అతడిని వీటికి గల ప్రత్యేకతను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణలో అంతరించిపోతున్న జాతులలో ఒకటైన బాతులు గ్రామానికి రావడంతో పదుల సంఖ్యలో పక్షులను చూడడానికి జనం ఎగబడ్డారు.గంటల తరబడి గంగమ్మ వాగులో బాతులు ఈతలు కొట్టాయి. గంటల తరబడి బాతులు సేద తీరడం తో ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు.

పత్తి మార్కెట్‌లో కొనుగోళ్లు నిలిపివేసిన వ్యాపారులు

- పత్తి రైతుల హరిగోశ
- మధ్యాహ్నం వరకు ప్రారంభం కానీ కొనుగోలు
- అధికారుల చొరవతో కొనుగోలు

జమ్మికుంట అక్టోబర్ 27 ప్రజాతీర్పు



జమ్మికుంట పత్తి మార్కెట్లో చైర్ పర్సన్ ఖరీదార్ల మధ్య ఏర్పడిన వివాదం రైతుల పాలిటి శాపంగా మారింది. ఆరుగాలం కష్టపడి పండించిన రైతుల పత్తికి గిట్టుబాటు ధర లభిస్తుందా..మార్కెట్‌లో నిర్ణయించిన ధర మిల్లుల్లోనూ అమలవుతుందా.. అనే ప్రశ్నల మధ్య వ్యవసాయ మార్కెట్ యార్డులో మరో వివాదం తెరపైకి వచ్చింది. మార్కెట్ పాలక కమిటీ చైర్‌పర్సన్ స్వప్నకు, మిల్లర్లకు మధ్య చోటుచేసుకున్న వాగ్వాదం పత్తి కొనుగోళ్లపై ప్రభావం చూపింది. నిరసనగా కొనుగోళ్లు చేపట్టలేమని ఖరీదుదారులు స్పష్టం చేయడంతో మార్కెట్‌లో కొనుగోళ్లు నిలిచిపోయాయి. దీంతో పత్తిని విక్రయించేందుకు దూరప్రాంతాల నుంచి వచ్చిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ధరల వ్యత్యాసంపై ప్రశ్నించడంతో వివాదం మార్కెట్‌లో వేలం ద్వారా నిర్ణయించిన ధరను మిల్లుల్లోకి పత్తి చేరిన తర్వాత తగ్గిస్తున్నారనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో చైర్‌పర్సన్ పి. స్వప్న మిల్లు వ్యాపారి ఎ. రాజయ్యను ప్రశ్నించినట్లు సమాచారం. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తాను చాలామంది మార్కెట్ చైర్మన్లను చూశానని, 'మీరేం చేస్తారు' అంటూ వ్యాపారి తనను అగౌరవపరిచేలా మాట్లాడారని చైర్‌పర్సన్ స్వప్న పేర్కొన్నట్లు తెలిసింది. తనను అగౌరవపరిచిన వ్యాపారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని ఆమె వెల్లడించారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఖరీదుదారులు కొనుగోళ్లు నిలిపివేయడంతో సమస్య మరింత జటిలమైంది. మార్కెట్‌లో తలెత్తిన వివాదానికి రైతులకు సంబంధం లేకపోయినా.. దాని ప్రభావాన్ని మాత్రం వారు భరించాల్సి వచ్చింది.

ఉదయం నుంచి ట్రాలీల వద్దే ఎదురుచూపులు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మల్హర్ మండలం తాడిచెర్లతో పాటు మొట్లపల్లి, ఇల్లంతకుంట, నాగంపేట, భేతిగల్, వీణవంక తదితర ప్రాంతాల నుంచి రైతులు తెల్లవారుజామునే పత్తిని ట్రాలీల్లో తీసుకొచ్చారు. కొనుగోళ్లు ప్రారంభమవుతాయని ఆశగా ఎదురుచూసిన వారికి నిరాశే ఎదురైంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కొనుగోళ్లు నిలిచిపోవడంతో ట్రాలీల వద్దే పడిగాపులు కాయాల్సి వచ్చింది. పత్తి అమ్ముడుపోకపోవడం, ఎప్పుడు కొనుగోళ్లు ప్రారంభమవుతాయో తెలియకపోవడంతో రైతులు మార్కెట్ కార్యాలయంలోకి వెళ్లి అధికారులను నిలదీశారు . ఈ వివాదంపై మార్కెట్ డిఎమ్ఓ షాబుద్దీన్, మార్కెట్ సెక్రటరీ మల్లేశం తో పాటు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రణవ్ బాబు చొరవ తీసుకొని వ్యాపారులతో మాట్లాడి సమస్యను జటిలం చేయకుండా రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు చేయాలని కోరడంతో వ్యాపారులు తిరిగి కొనుగోలను ప్రారంభించారు.



మాదారంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్

(రాంపెల్లి చంద్రశేఖర్ ప్రజాతీర్పు

తాండూర్ మండలం రిపోర్టర్) అక్టోబర్ 27

తాండూర్: మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం మాదారం గ్రామపంచాయతీ పరిధిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్ చేతుల మీదుగా తెల్ల రేషన్ కార్డు కలిగిన అర్హులైన కుటుంబాలకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా రేషన్ కార్డుదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రజలచే ఎన్నుకోబడిన ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రతి అర్హుడైన రేషన్ కార్డుదారుడికి స్మార్ట్ రేషన్ కార్డు అందే వరకు పంపిణీ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. త్వరలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, వార్డు సభ్యులు గొర్లపల్లి బాణేష్, గోదెల లక్ష్మి, కత్తెర్ల రవికుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీవాణి, జీపీఓ ఆలీ, కాంగ్రెస్ నాయకులు జోరీగల రమేష్, ఆసంపల్లి శ్రీనివాస్, తోట శ్రీనివాస్, మీస శంకర్, సిరికొండ సత్యనారాయణ, బుద్ధ తిరుపతి, తాండూరి సురేష్, రేషన్ డీలర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి, డివిజనల్, ఛార్జ్ అధికారులకు రెండవ విడత శిక్షణ తరగతులు నిర్వహణ

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు

సూర్యాపేట జిల్లా ప్రతినిధి) అక్టోబర్ 27



జనగణనలో ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం ఆయన ముఖ్య ప్రణాళిక అధికారి ఆధ్వర్యంలో జన గణనపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా, డివిజనల్ స్థాయి అధికారులు,చార్జ్ ఆఫీసర్లకు (తహసీల్దార్లు), అదనపు చార్జ్ ఆఫీసర్లు (ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు) శిక్షణా తరగతుల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జన గణన రెండో దశ నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్, విధివిధానాలు మరియు అధికారుల బాధ్యతల గురించి వివరించారు. జన గణన రెండో దశను 2027, జనవరి 10వ తేదీ నుంచి ఫిబ్రవరి 28 వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. స్వీయ గణన 2027 జనవరి 10 నుంచి జనవరి 24 వరకు, జన గణన 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు నిర్వహించడం జరుగుతుందని, అలాగే 2027 ఫిబ్రవరి 28 న రాత్రి ఇళ్లు లేని వారిని గణించడం జరుగుతుందని, రివిజనల్ రౌండ్ 2027 మార్చి 1 నుంచి మార్చి 5 వరకు నిర్వహించడం జరుగుతుందని, జన గణనలో భాగంగా ఎన్యుమరేటర్లు ప్రతి గృహ యజమానిని సంప్రదించి మొత్తం (40) ప్రశ్నలకు సంబంధించిన వివరాలను సేకరిస్తారని, ప్రజలు ఎన్యుమరేటర్లకు సరైన సమాచారాన్ని అందించి జనాభా గణన విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. జనాభా గణన ప్రక్రియను నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో సూచించారు. అదనపు కలెక్టర్ బి హరిసింగ్, సీపీఓ కిషన్, జడ్పీ సీఈవో శిరీష, ఆర్డీవోలు వేణుమాధవ్, శ్రీనివాసులు, సూర్యనారాయణ ట్రైనర్లు ఓబులాల్, జంగయ్య హాజరయ్యారు.

అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ వరంగల్‌లో సైకిల్ ర్యాలీ

- 89 ఏళ్ల వయసులోనూ ర్యాలీలో పాల్గొన్న మామిడి నర్సయ్య



ప్రజాతీర్పు, తెలంగాణ స్టేట్ క్రైమ్ బ్యూరో

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో మంగళవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా, ఐపీఎస్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమం పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించడంతో పాటు ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించే లక్ష్యంతో సాగింది. హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, వరంగల్ ట్రై సిటీలోని వివిధ సైక్లిస్ట్ బృందాల సభ్యులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. విధి నిర్వహణలో ప్రజల రక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా మాట్లాడుతూ, ప్రజల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. వారి సేవలను ఎప్పటికీ గుర్తుంచుకోవాలని, ఈ సైకిల్ ర్యాలీ అమరవీరులకు అంకితమైన నివాళి అని తెలిపారు. సైక్లింగ్ వంటి శారీరక వ్యాయామాలు ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో వ్యాయామానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ ర్యాలీలో 60 ఏళ్లు పైబడిన పలువురు ఉత్సాహంగా పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యంగా 89 ఏళ్ల వయసులోనూ సైకిల్ ర్యాలీలో పాల్గొన్న మామిడి నర్సయ్యను పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. ఆయన ఉత్సాహం అందరికీ స్ఫూర్తిదాయకమని, వయసుతో సంబంధం లేకుండా శారీరక వ్యాయామం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చనే సందేశాన్ని ఈ కార్యక్రమం అందించిందని పేర్కొన్నారు. ర్యాలీ నిర్వహణలో కీలక పాత్ర పోషించిన ఏఆర్ అదనపు డీసీపీలు వి. శ్రీనివాస్, సురేష్, ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్‌లను పోలీస్ కమిషనర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, హనుమకొండ ఏసీపీ నర్సింహారావు, పలువురు సీఐలు, ఎస్ఐలు, ఏఆర్ సిబ్బంది, నగరంలోని వివిధ సైక్లిస్ట్ బృందాల సభ్యులు పాల్గొన్నారు. మొత్తం సుమారు 200 మంది ఈ ర్యాలీలో భాగస్వాములయ్యారు.



కురవి మండలంలో వివిధ గ్రామాల్లో...

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ సమీక్ష సమావేశాలు...

కురవి అక్టోబర్ 27(ప్రజా తీర్పు)

కురవి మండలంలోని మొగిలిచర్ల, బలపాల, కంచర్లగూడెం, కందికొండ గ్రామాల్లో గ్రాడ్యుయేట్ ఎన్నికలు, ఎల్ నినో ప్రభావ పరిస్థితుల దృష్ట్యా సర్ ఫేజ్-××× అంశాలపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామస్థాయి సమీక్ష సమావేశాలు నిర్వహించారు.ఈ సమావేశాలు కురవి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలగాని శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని పరిస్థితులను సమీక్షించి, సంబంధిత అంశాలపై నాయకులు, ప్రజాప్రతినిధులతో చర్చించారు.ఈ కార్యక్రమంలో వీరితో పాటు కురవి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దడిగల శరత్, వివిధ గ్రామాల ఉప సర్పంచులు కొర్ని సునీత - చందు (నరేష్),దయ్యాల శ్రీధర్,కురవి మేజర్ గ్రామ వార్డు సభ్యులు బాదె వీరభద్రం, పంచాయతీ కాంగ్రెస్ పార్టీ నాయకులు చిన్నూరి వెంకన్న,రంజాన్ పాషా,బుక్క నాగరాజ్, పాటు ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, జిల్లా నాయకులు, మండల నాయకులు,గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



నెల్లికుదురు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

- గంజాయి, గుడుంబా అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాతీర్పు, తెలంగాణ స్టేట్ క్రైమ్ బ్యూరో

మహబూబాబాద్ పోలీస్ సిబ్బంది విధుల నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ సూచించారు. మంగళవారం నెల్లికుదురు పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేసి, స్టేషన్‌లో విధుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, సాంకేతిక వ్యవస్థల వినియోగం, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కరుణాకర్‌కు పలు సూచనలు చేశారు. పోలీస్ సిబ్బంది తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఎస్పీ సూచించారు. గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, ప్రజలతో సమన్వయం పెంపొందించుకోవాలని తెలిపారు. గ్రామాల్లో జరుగుతున్న పరిణామాలపై నిఘా ఉంచుతూ శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల పనితీరు, వాటి నిరంతర పర్యవేక్షణపై ఎస్పీ ఆరా తీశారు. సీసీటీఎన్ఎస్ ద్వారా అందిస్తున్న ఆన్‌లైన్ పోలీస్ సేవలు, కేసుల నమోదు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ పోలీస్ సేవలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా ప్రజలకు అందించాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగం, గుడుంబా తయారీ, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ ఆదేశించారు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనుమానిత వ్యక్తుల కదలికలను పరిశీలించడంతో పాటు పాత నేరస్థులు, పదేపదే నేరాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించాలని, అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు సమర్థవంతమైన తనిఖీలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. నేరాల నియంత్రణ, అక్రమ రవాణా నిరోధం, ఇతర ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను ప్రణాళికాబద్ధంగా చేపట్టి ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని జిల్లా ఎస్పీ డా. శబరీష్ సూచించారు.



టిప్పర్ బ్యాటరీల చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

- రెండు బ్యాటరీలు స్వాధీనం.. వాటి విలువ రూ.20 వేలు

వివరాలు వెల్లడించిన ఆత్మకూరు సిఐ బాబూలాల్

ప్రజాతీర్పు, తెలంగాణ స్టేట్ క్రైమ్ బ్యూరో

టిప్పర్ వాహనం నుంచి బ్యాటరీలను దొంగిలించిన కేసులో ఓ వ్యక్తిని ఆత్మకూర్ పోలీసులు అరెస్ట్ చేసి, రెండు బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.20 వేలుగా పోలీసులు అంచనా వేశారు. ఆత్మకూర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ బాబులాల్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌లోని కాశీబుగ్గకు చెందిన పస్తం ఐలుకుమార్ (35)ను అక్టోబర్ 26న ఆత్మకూర్ మండలం గూడెపహాడ్ జంక్షన్‌లోని రాజరాజేశ్వరి పంక్చర్ షాప్ వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. గత జూలై నెలలో గూడేపహాడ్‌లోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద రెగొండ మండలానికి చెందిన మేకల భాస్కర్ రెడ్డికి చెందిన టిప్పర్ వాహనం నుంచి రెండు బ్యాటరీలు చోరీకి గురైనట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ కేసులో నిందితుడి వద్ద నుంచి చోరీకి గురైనట్లు పేర్కొన్న రెండు బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితుడిని అక్టోబర్ 27న పరకాల కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసు దర్యాప్తు, నిందితుడి అరెస్ట్‌లో హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ కరణ్, మహిళా కానిస్టేబుల్ ప్రవళిక, హోంగార్డు రామన్న పాల్గొన్నారు.

నవంబర్ 5న కరీంనగర్ లో మహా ర్యాలీ

- " సర్ " పేరుతో కేంద్ర ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర
- కాంగ్రెస్, విపక్షాలు చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పికొడదాం
- కేంద్ర మంత్రి బండి సంజయ్

(వకుళాభరణం భానుప్రకాష్

ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్ అక్టోబర్ 27)



'సర్' పేరుతో నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని కూల్చి విదేశీ శక్తులతో కలిసి దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కాంగ్రెస్, బీజేపీ, ఆప్ సహా చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈనెల 5న కరీంనగర్ లో "ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం --- అరాచకత్వాన్ని అంతం చేద్దాం" పేరిట భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో వేలాది మందితో 'మహా ర్యాలీ' నిర్వహిస్తున్నట్లు మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావుతో పాటు జాతీయ ప్రతినిధులు కూడా ఈ ర్యాలీకి హాజరవుతారని తెలిపారు. దేశమంతా చర్చ జరిగేలా వినూత్న రీతిలో ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. మంగళవారం స్థానిక శుభమంగళ కన్వెన్షన్ లో బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మండలాధ్యక్షులు, మండల ఇంఛార్జీలుసహా ముఖ్య నేతలు హాజరైన ఈ సమావేశానికి కేంద్ర మంత్రితోపాటు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు ఆంటోనీరెడ్డి, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు సాయిని మల్లేశం, రెడ్డబోయిన గోపి, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, పార్టీ సీనియర్ నేతలు కోమల ఆంజనేయులు, నల్లాల ఓదెలు చెన్నమనేని వికాస్ రావు మోహన్ రెడ్డి గంగాడి క్రిష్ణారెడ్డి బోయినిపల్లి ప్రవీణ్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాలీ ఏర్పాట్లు, జన సమీకరణపై చర్చించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించారంటూ కాంగ్రెస్, విపక్ష కూటమి నేతలు విష ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తున్నాయి. ఈ 13 కోట్లలో సుమారు 2.8 కోట్ల మంది మరణించారు. దాదాపు 3 కోట్ల మంది క్షేత్రస్థాయి పరిశీలనలో అడ్రస్‌లలో అందుబాటులో లేరు. 6.3 కోట్ల మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. మరో కోటి మంది ఓటర్ల పేర్లు రెండు, మూడు చోట్ల ఓటర్ లిస్టులో నమోదు చేసుకున్నారు. చనిపోయిన ఓటర్లను ఓటర్ జాబితా నుండి తొలగించాలా? వద్దా? అని నిలదీశారు. అంతెందుకు మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు చనిపోయి ఏళ్లు దాటినా ఇంకా ఓటర్ జాబితాలో ఆయన పేరుంది. సర్ ప్రక్రియలో భాగంగా ఆయన పేరును తొలగించారు? ఇందులో తప్పేముంది? అట్లాగే డూప్లికేట్ ఓట్లను తొలగిస్తే రాద్దాంతమెందుకు? అట్లాగే విదేశాల నుండి అక్రమంగా వలస వచ్చి ఓటర్లుగా నమోదైన రోహింగ్యాల ఓట్లను తొలగిస్తే తప్పేముంది? అని ప్రశ్నించారు వాస్తవానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ వంటి పార్టీలు హైదరాబాద్ లో రోహింగ్యాల ఓట్లతోనే గెలుస్తూ వస్తున్నాయి. మహేశ్వరం నియోజకవర్గంలో దాదాపు 40 వేలకు పైగా రోహింగ్యాలు ఓటర్లుగా నమోదై బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాయి. పాతబస్తీలో మజ్లిస్ పార్టీ సైతం రోహింగ్యాలు, డూప్లికేట్ ఓట్లు, మరణించిన వారి ఓట్లతోనే గెలుస్తూ వస్తోందని మంత్రి సంజయ్ ఆరోపించారు. నాటి కేసీఆర్ ప్రభుత్వంతోపాటు నేటి కాంగ్రెస్ ప్రభుత్వం సైతం రోహింగ్యాలకు రేషన్ కార్డు, ఇండ్లుసహా ప్రభుత్వ పథకాల లబ్ధి కల్పించాయి. అర్హులైన ఇతర ఓటర్లకు అన్యాయం చేశాయి. సర్ ప్రక్రియలో భాగంగా రోహింగ్యాల ఓట్లను ఎన్నికల సంఘం తొలగిస్తుంటే ఆయా పార్టీలు తట్టుకోలేక మోదీ ప్రభుత్వంపై అభాండాలు వేస్తున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలను ధ్వంసం చేసేందుకు కుట్రలు చేస్తున్నాయని మంత్రి ధ్వజమెత్తారు. ఎన్నికల్లో మోదీని ఎదుర్కొనే శక్తి లేక కాంగ్రెస్ కూటమి ఈ కుట్రలకు సిద్ధమైంది. విపక్షాల కుట్రలను తిప్పికొట్టేందుకు ప్రజలకు వాస్తవాలు చెప్పేందుకు ఈనెల 5న కరీంనగర్ లో 'లోక్ తంత్ర బచావో-అరాచకత హఠావో' పేరిట వేలాది మందితో కనీవినీ ఎరగని రీతిలో వినూత్న రీతిలో దేశవ్యాప్తంగా చర్చ జరిగేలా మహా ర్యాలీ నిర్వహిద్దాం. కేంద్ర ప్రభుత్వ లబ్ధిదారులతోపాటు విద్యార్థులు, యువత, లాయర్లు, ఇంజనీర్లు, మేధావులు, డాక్టర్లుసహా అన్ని వర్గాల ప్రజలను ఈ ర్యాలీలో భాగస్వాములను చేద్దాం. కరపత్రాలు రూపొందించి ఇంటింటికీ పంపి ప్రజలను చైతన్యం చేద్దామని అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని పోలింగ్ బూత్ లవారీగా సమావేశాలు నిర్వహించి మహా ర్యాలీకి హాజరయ్యేలా ఏర్పాట్లు చేయండి. వారికి అవసరమైన రవాణా, వసతి సౌకర్యాలను కల్పించండి. వినూత్న రీతిలో కనీవినీ ఎరగని విధంగా మహా ర్యాలీ నిర్వహించి దేశవ్యాప్తంగా చర్చ జరిగేలా చేద్దామని మంత్రి సంజయ్ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.





సైబర్ నేరం జరిగితే వెంటనే 1930కు కాల్ చేయాలి.

- ఎస్ఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పోలీసుల అవగాహన సదస్సు.

నర్సంపేట, అక్టోబర్ 27 ప్రజా తీర్పు క్రైమ్ న్యూస్ ప్రతి నిధి వెంకట్):

విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆన్‌లైన్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలని నర్సంపేట సీఐ ఎం. శ్రీనివాస్, ఎస్ఐ నిహారిక సూచించారు. మంగళవారం నర్సంపేటలోని ఎస్ఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎం. శ్రీనివాస్, ఎస్ఐ నిహారికతో పాటు కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు వివిధ రూపాల్లో జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులను నమ్మవద్దని తెలిపారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని చెప్పారు. ఆన్‌లైన్ లావాదేవీల సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎస్ఐ నిహారిక మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు మాయమాటలతో ప్రజలను నమ్మించి డబ్బులు కాజేస్తున్నారని తెలిపారు. ఎవరైనా ఆన్‌లైన్ ఆర్థిక మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. అలాగే అధికారిక జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ ఎఎఎ.ఎఎవతీఎతీఅఎవ.స్వశీజ.అఅ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని వివరించారు. మోసానికి సంబంధించిన ఫోన్ నంబర్లు, సందేశాలు, లావాదేవీల వివరాలు, స్క్రీన్‌షాట్లను భద్రపరచుకోవాలని తెలిపారు. సత్వరంగా ఫిర్యాదు చేయడం వల్ల మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం పెరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, గుర్తుతెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలను పంచుకోవద్దని ఎస్ఐ నిహారిక సూచించారు. మొబైల్ ఫోన్లను అవసరమైన మేరకు వినియోగిస్తూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యాభివృద్ధికి ఉపయోగించుకోవాలని తెలిపారు.

సైబర్ భద్రతపై అవగాహన అవసరం

సైబర్ నేరాల నివారణకు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పోలీసులు సూచించారు. విద్యార్థులు తాము తెలుసుకున్న జాగ్రత్తలను కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా తెలియజేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితో పాటు కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ప్రజలకు సూచన: ఆన్‌లైన్ ఆర్థిక మోసం జరిగిన వెంటనే 1930కు కాల్ చేయండి. ఆలస్యం చేయకుండా ఫిర్యాదు చేయడం ముఖ్యం.

ఘనంగా వి.ఆర్ ఫౌండేషన్ చైర్మన్53వ జన్మదిన వేడుకలు

సిద్దిపేట జిల్లా, అక్టోబర్ 27(:ప్రజా తీర్పు)



కె.వి.ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కల్వకుంట్ల వంశీధర్ రావు 53వ జన్మదిన వేడుకలు సిద్దిపేట పట్టణంలోని కొండ భూదేవి గార్డెన్ లో సోమవారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని పలు దేవాలయాల్లో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్న కోడూరు, నారాయణరావుపేట, మండల కేంద్రాల్లో బిఆర్ఎస్ నేతలు, అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లను, బ్రెడ్ ను పంపిణీ చేశారు. కె.వి.ఆర్ సేన సభ్యులు పట్టణంలోని అనేక కూడళ్ల వద్ద అన్నదానం నిర్వహించారు. కొండ భూదేవి గార్డెన్ లో రక్తదాన శిబిరం నిర్వహించారు. కల్వకుంట్ల వంశీధర్ రావు అభిమానులు రక్తదానం చేశారు. వంశీధర్ రావు సైతం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా భారీ కేకును కట్ చేసి, అభిమానులు ఆయనను గజమాలతో, ఖడ్గంతో, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అనేక సామాజిక సేవ కార్యక్రమాలు తమ ఫౌండేషన్ ద్వారా చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు నోట్ బుక్స్, పరీక్ష ప్యాడ్స్, మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ, విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ, నిరుద్యోగులకు డ్రైవింగ్ శిక్షణ ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు కొనసాగిస్తానని అన్నారు. ఇంతమంది అభిమానాన్ని చూస్తుంటే సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కల్వకుంట్ల కన్నారావు, మరియు కెవిఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగ తగిలి నలుగురికి తీవ్ర గాయాలు

హుస్నాబాద్ అక్టోబర్ 27 రవీందర్ ప్రజా తీర్పు



సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం మహమ్మదాపూర్ గ్రామంలో ఇంటి నిర్మాణ పనులు చేపడుతుండగా 11 కేవీ విద్యుత్ తీగ తగిలి నలుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారు. ఈ ప్రమాదంలో కల్లూరి రాధ (25), కత్తుల రజిత, చిర్ర రాజు (36), కుంచం సంతోష్ (34) గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే వారి పరిస్థితి విషమంగా మారడంతో నలుగురినీ మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. వారిలో కల్లూరి రాధ పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. ఆమె చెవుల నుంచి రక్తస్రావం జరిగినట్లు సమాచారం.

దళారుల చేతుల్లో రైతులు మోసపోవద్దు

- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి .. ఎమ్మెల్యే కవ్వంపల్లి

(వెగ్గళం రాధాకిషన

ప్రజాతీర్పు, ఇల్లంతకుంట) అక్టోబర్ 27



ధాన్యం విక్రయాల విషయంలో రైతులు దళారుల చేతుల్లో మోసపోవద్దని మానకొండూరు ఎమ్మెల్యే, డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. మంగళవారం మండలంలోని వంతడ్పుల, అనంతారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే తమ పంటను విక్రయించాలని కోరారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నందున పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ధాన్యం తూకంలో కోతలు, తేమ శాతం నిర్ధారణలో మోసాలకు తావులేకుండా కొనుగోళ్లు చేపడతామని స్పష్టం చేశారు.కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బులు 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని, ఆ ఆశయ సాధనలో భాగంగానే మహిళా సంఘాలకు ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు వివరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఇల్లంతకుంట పీఏసీఎస్ చైర్మన్ ఊట్కూరి వెంకటరమణారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సప్తగిరి సాహిత్య , వైస్ చైర్మన్ భరత్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, సర్పంచులు లావణ్య, మామిడి రాజు, నేరెళ్ల విజయ్, పసుల వెంకటి తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సమిష్టి కృషితోనే ఆర్టీసీ ప్రగతి

- అంకితభావం, నిజాయితీతో పనిచేస్తేనే సంస్థకు ఉజ్వల భవిష్యత్తు.

మేడిపల్లి , అక్టోబర్ 27 ప్రజాతీర్పు:



ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి ఉద్యోగుల సమిష్టి కృషి, అంకితభావం, బాధ్యతాయుతమైన సేవలే ప్రధాన బలమని మేడిపల్లి సీఐ డి. జలంధర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి తన విధులను నిజాయితీగా నిర్వర్తించినప్పుడే సంస్థ మరింత బలోపేతమై ప్రజల విశ్వాసాన్ని చూరగొంటుందని అన్నారు. మంగళవారం బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని చెంగిచెర్ల టీజీఎస్ఆర్టీసీ డిపోలో సంస్థ అభివృద్ధికి విశేష కృషి చేసి ఆదర్శంగా నిలిచిన ఉద్యోగుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ జలంధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు సురక్షితమైన, మెరుగైన రవాణా సేవలు అందించడంలో ఆర్టీసీ ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ ప్రమాదరహిత ప్రయాణాన్ని అందించేందుకు డ్రైవర్లు, కండక్టర్లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉద్యోగుల క్రమశిక్షణ, సమయపాలన, సేవాభావం సంస్థ ప్రతిష్ఠను మరింత పెంచుతాయని తెలిపారు. ముఖ్యంగా ఆర్టీసీ ఆర్థిక పరిపుష్టికి ఇంధన పొదుపు ఎంతో అవసరమని, ప్రతి ఉద్యోగి ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. సంస్థ అభివృద్ధి కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఉద్యోగి తన వంతు పాత్ర పోషించినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను గుర్తించి సన్మానించడం అభినందనీయమని, ఇటువంటి కార్యక్రమాలు ఇతర ఉద్యోగుల్లోనూ మరింత ఉత్సాహాన్ని, బాధ్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఆదర్శంగా నిలిచిన ఆర్టీసీ ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ ఉదయ్‌భాస్కర్, చెంగిచెర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ స్వాతి, డిపో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పవిత్ర గౌతమీ గంగకు పట్టిన చెత్త గండం.. దక్షిణ గంగ ఏమైంది?

- చెత్తకుప్పగా మారిన మంథని గోదావరి ఘాట్.. పట్టించుకోని మున్సిపల్.. దేవాదాయ శాఖ అధికారులు

మంథని, అక్టోబర్ 27 ప్రజాతీర్పు



తెలంగాణలో ఆధ్యాత్మిక, చారిత్రక ప్రాధాన్యత కలిగిన మంథని పట్టణంలో ప్రవహిస్తున్న పవిత్ర గోదావరి నది పరిసరాలు చెత్తాచెదారంతో నిండిపోయి దయనీయంగా మారాయి. దక్షిణ గంగగా, గౌతమీ గంగగా భక్తులు పూజించే గోదావరి నది ఘాట్ వద్ద అపరిశుభ్రత రాజ్యమేలుతోంది. పితృదేవతలకు పిండ ప్రదానాలు, ఇతర పితృకార్యాలు నిర్వహించేందుకు నిత్యం భక్తులు వచ్చే ఈ ప్రాంతంలో పూజా సామగ్రి వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లు, పాత బట్టలు, పూల దండలు, చితాభస్మం పేరుకుపోవడంతో ఘాట్ చెత్తకుప్పను తలపిస్తోంది. భక్తి, ఆధ్యాత్మికతకు నిలయంగా ఉండాల్సిన పవిత్ర తీరం అపరిశుభ్రతకు చిరునామాగా మారడం పట్ల స్థానికులు, భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంథని గోదావరి నదికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యత దృష్ట్యా పితృకార్యాలు, పుణ్యస్నానాల కోసం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడికి వస్తుంటారు. ముఖ్యంగా గోదావరి పుష్కరాల సమయంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన ఘాట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉన్నప్పటికీ, కనీస పారిశుధ్య చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పుష్కరాల నిర్వహణ పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేసే అధికారులు, ముందస్తుగా ఘాట్ అభివృద్ధి, పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణపై దృష్టి సారించకపోవడం పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం పితృకార్యాలు జరిగే ప్రాంతంలో కనీసం చెత్త వేయడానికి డస్ట్‌బిన్లు, పూజా సామగ్రి వ్యర్థాలు, చితాభస్మం సేకరణకు ప్రత్యేక ఏర్పాట్లు కూడా లేకపోవడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. గోదావరి తీరంలో విగ్రహాలు, పూజా సామగ్రి వ్యర్థాలు పేరుకుపోతున్నప్పటికీ మున్సిపల్ సిబ్బంది నిరంతర శుభ్రత చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్, దేవాదాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి ఘాట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరుతున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులే కొనసాగితే పుష్కరాల సమయానికి భక్తులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పవిత్ర గోదావరి నదిని చెత్త నుంచి కాపాడటంతో పాటు ఘాట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు ఇప్పటికైనా స్పందించాలని, ప్రతిరోజూ పారిశుధ్య పనులు నిర్వహించాలని, వ్యర్థాల సేకరణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని భక్తులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పుష్కరాల సమయంలో హడావుడి చర్యలకు పరిమితం కాకుండా, గోదావరి తీరాన్ని శాశ్వతంగా పరిశుభ్రంగా ఉంచేలా ప్రక్షాళన చర్యలు చేపట్టాలని డీవైఎఫ్ఐ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గొర్రెంకల సురేష్ డిమాండ్ చేశారు.



మహిళ కండక్టర్‌పై దాడిని ఖండిస్తూ నర్సంపేట డిపో ఎదుట కార్మికుల ధర్నా

- ప్రవళికకు మెరుగైన వైద్యం అందించాలి – పూర్తిస్థాయి జీతంతో ఐఓడీ కల్పించాలి

నర్సంపేట రూరల్, అక్టోబర్ 27, ప్రజా తీర్పు ప్రతినిధి:

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మణుగూరు డిపోకు చెందిన మహిళా కండక్టర్ ప్రవళికపై ప్రయాణికురాలు జరిపిన దాడిని నిరసిస్తూ నర్సంపేట డిపో కార్మికులు డిపో ఎదుట ధర్నా నిర్వహించి, ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా కార్మికులు పలు డిమాండ్లను అధికారుల ముందు ఉంచారు. దాడిలో గాయపడిన ప్రవళికకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని, ఆమె పూర్తిగా కోలుకునేంత వరకు ఐఓడీ మంజూరు చేసి పూర్తి జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, ఆమెపై దాడికి పాల్పడిన ప్రయాణికురాలికి కఠిన శిక్ష విధించాలని, ప్రభుత్వం తరఫున రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో నర్సంపేట డిపో ఉద్యోగులు నర్సింహులు, సుజాత, రవీందర్ రెడ్డి, చైతన్య, సూపరవైజర్ గోవర్ధన్ మరియు ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని మహిళా ఉద్యోగుల భద్రతకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఎస్ ఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమం

నర్సంపేట రూరల్, అక్టోబర్ 27,

ప్రజా తీర్పు ప్రతినిధి:

నర్సంపేట పట్టణంలోని ఎస్ ఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో మంగళవారం సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నర్సంపేట సీఐ ఎం. శ్రీనివాస్, నూతన ఎస్ఐ నిహారిక హాజరై విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వాటిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు చదువుపై దృష్టి సారించి, మొబైల్ ఫోన్ల వినియోగాన్ని తగ్గించాలని తెలిపారు. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను అవసరమైన మేరకే ఉపయోగించాలని, అపరిచిత వ్యక్తులు పంపించే లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దని హెచ్చరించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ అడిగినా చెప్పకూడదని, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. తమ బ్యాంకు ఖాతాల్లోకి తెలియని వ్యక్తుల నుంచి డబ్బులు జమ అయితే వాటిని స్వయంగా తిరిగి పంపకుండా వెంటనే బ్యాంకు అధికారులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఆన్‌లైన్ మోసాలు, నకిలీ బహుమతుల ప్రకటనలు, ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నిహారిక మాట్లాడుతూ, సైబర్ నేరగాళ్లు వివిధ పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు పంచుకోవద్దని తెలిపారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే భయపడకుండా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో 112 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో డబ్బులు పోగొట్టుకున్నప్పుడు ఆలస్యం చేయకుండా ఫిర్యాదు చేస్తే డబ్బుల బదిలీని అడ్డుకునే అవకాశం ఉంటుందని వివరించారు.విద్యార్థులు సైబర్ భద్రతా నియమాలను పాటిస్తూ తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా అవగాహన కల్పించాలని పోలీసు అధికారులు సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు సురక్షితమైన మొబైల్ వినియోగం, వ్యక్తిగత సమాచార రక్షణ, సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొయ్యడి సనత్ కుమార్, పారామెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శిరీష, వైస్ ప్రిన్సిపాల్ సూరయ్య, సంతోష్, వెంకన్న, రమేష్ నాయక్, లయన్ ప్రవీణ్, హరి భూషణ్, సందీప్, శ్వేత, నజీమా, కుమార్, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ ములుగులో సైకిల్ ర్యాలీ

ప్రజాతీర్పు, తెలంగాణ స్టేట్ క్రైమ్



విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమ రవీరుల త్యాగాలను స్మరించు కుంటూ ములుగు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమం జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామనాథ్, ఐపీఎస్ ఆధ్వర్యంలో జరిగింది. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధులు నిర్వహిస్తూ ప్రాణత్యాగం చేసిన పోలీసుల సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. వారి ధైర్యసాహసాలు, నిస్వార్థ సేవలు పోలీసు శాఖకు నిరంతరం స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా పోలీసులు ప్రజల రక్షణకు అంకితభావంతో పనిచేయాలని ఈ ర్యాలీ ద్వారా సందేశాన్ని అందించారు. ఈ సైకిల్ ర్యాలీని ఆపరేషన్స్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ డి. తిరుపతి సమన్వయంతో నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సదానందం, ములుగు ఎస్‌డీపీఓ నలువాల రవీందర్, ములుగు సీఐ దారం సురేష్, సీసీఎస్ సీఐ కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు స్వామి, వెంకటనారాయణ, శ్రీకాంత్‌తో పాటు పలువురు ఎస్సైలు, ఆర్ఎస్ఐలు, క్యూఆర్‌టీ ప్రత్యేక బలగాల సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తో ఎమ్మెల్యే జిఎంఆర్ భేటీ

సోదరుడి కుమారుడి నిశ్చితార్థానికి ఆహ్వానం

పటాన్ చేరు, అక్టోబరు 27 ప్రజాతీర్పు ప్రతినిధి



తెలంగాణ తొలి ముఖ్యమంత్రివర్యులు, బిఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు కెసిఆర్ ని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి జిఎంఆర్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం సాయంత్రం ఎర్రవల్లి లోని కెసిఆర్ ఫామ్ హౌస్ లో. రాష్ట్ర మాజీ మంత్రివర్యులు, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు తో కలిసి.కేసీఆర్ ని కలిశారు. ఈ సందర్భంగా ఈ నెల 30వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న తన సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి కుమారుడు గూడెం సందీప్ రెడ్డి నిశ్చితార్థ వేడుకకు హాజరు కావాలని కేసీఆర్ ని ఎమ్మెల్యే జిఎంఆర్ ఆహ్వానించారు. అనంతరం విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని కెసిఆర్ కి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రతి భూ యజమానికి 'భూదార్' ప్రత్యేక గుర్తింపు సంఖ్య

- ఉపగ్రహ చిత్రాలతో కూడిన భూ పటాలు పట్టాదారు పాస్ పుస్తకాల్లో పొందుపరుస్తాం
- ప్రతి జిల్లాలో తొలి విడతగా 70 రెవెన్యూ గ్రామాల్లో భూ సర్వే
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

మెదక్, అక్టోబర్ 27,(ప్రజా తీర్పు ప్రతినిధి):



రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారం, భూ హక్కుల పరిరక్షణ, పారదర్శక భూ రికార్డుల నిర్వహణ లక్ష్యంగా భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రతి భూ యజమానికి ఆధార్ తరహాలో 'భూదార్' పేరుతో ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయించే విధానాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఉపగ్రహ చిత్రాలతో కూడిన భూ పటాలను పట్టాదారు పాస్ పుస్తకాల్లో పొందుపరచ నున్నట్లు చెప్పారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, గృహ నిర్మాణ శాఖల అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ ప్రాధాన్యతలు, భూ సర్వే, రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపు, ఎల్‌ఆర్ఎస్ ప్రభావంతో తలెత్తే నీటి సమస్యలు తదితర అంశాలపై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా భూ సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు మంత్రి తెలిపారు. గతంలో అమల్లో ఉన్న ధరణి విధానంలో ఎదురైన సమస్యలకు పరిష్కారం చూపుతూ, భూ పరిపాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నాయకత్వంలో భూభారతి చట్టాన్ని తీసుకొచ్చా మన్నారు.తొలి విడతలో రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాల్లో భూ సర్వే నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు సర్వేను పూర్తి చేసి, భూముల హద్దులు, విస్తీర్ణం, రికార్డులకు సంబంధించి స్పష్టత తీసుకురావాలని అధికారులకు సూచించామని తెలిపారు.

ప్రతి పేదవాడి భూ హక్కులకు రక్షణ

ప్రజా ప్రభుత్వం పేదలు, నిరుపేదలు, భూములు కలిగిన రైతులు సహా అన్ని వర్గాల ప్రజల హక్కులకు రక్షణ కల్పించేలా అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. భూ సమస్యల పరిష్కారంలో పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ, అర్హులైన వారికి న్యాయం జరిగేలా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. భవిష్యత్తులోనూ ప్రజల పక్షాన నిలిచి, వారి హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. గతంలో అసంపూర్తిగా వదిలేసిన రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలను ప్రస్తుత ప్రభుత్వం చిత్తశుద్ధితో పూర్తి చేస్తోందని మంత్రి తెలిపారు. ఇప్పటికే సుమారు 90 శాతం ఇళ్లను అర్హులైన పేదలకు కులం, మతం, ప్రాంతం, రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా కేటాయించే ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. మిగిలిన ఇళ్లను కూడా 15 రోజుల్లోగా అర్హులకు కేటాయించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. అదేవిధంగా, ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యేలా అవసరమైన ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని నిర్ణయించినట్లు మంత్రి పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో నీటి లభ్యతపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఇప్పటికే ఏడు ఉమ్మడి జిల్లాల్లో ఇదే తరహా సమీక్షా సమావేశాలు నిర్వహించామని, ఎనిమిదో సమావేశాన్ని ఉమ్మడి మెదక్ జిల్లాలో నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. భూ సమస్యలను పరిష్కరించడంతో పాటు భూ యజమానుల హక్కులకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు.

ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే సింగూరు వంటి ప్రాజెక్టుల్లో నీటి సమస్యలు తలెత్తుతున్నాయని, రాబోయే రోజుల్లో ఇతర ప్రాజెక్టుల్లోనూ తాగునీటి లభ్యతకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా కరువు పరిస్థితులు తీవ్రతరం అయ్యే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని, తాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రెండో పంట సాగుకు అవసరమైన నీరు, విద్యుత్‌ను సమకూర్చేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసినా, నీటి లభ్యతే ప్రధాన సమస్యగా మారే పరిస్థితులు ఉన్నాయని వివరించారు. ఈ సమస్య ఒక్క తెలంగాణకే పరిమితం కాదని, దేశవ్యాప్తంగా నీటి ఎద్దడి పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు పరిస్థితులను అర్థం చేసుకొని, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని రెండో పంట సాగుకు వెళ్లవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. నీటి వనరుల పరిరక్షణలో రైతులు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. నీటి కొరతపై ప్రజలు, రైతులకు వాస్తవ పరిస్థితులను వివరించడంలో ప్రతిపక్షాలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి కోరారు. రాష్ట్రానికి రావాల్సిన హక్కులు, నిధులను అందించి సహకరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని తెలిపారు. ఈ అంశాలపై చర్చించేందుకు రేపు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందని పూర్తిగా నమ్ముతున్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, రైతుల ప్రయోజనాలు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020